వేంకటరాయశాస్త్రి, వేదము, 1853-1929

ప్రియదర్శికా నాటిక

మదరాసు, 1910

Record no. 185

Vēṅkaṭarāyaśāstri, Vēdamu, 1853-1929

Priyadarśikānāṭika

Madarāsu, 1910

Record no. 185

Bibliographic Record Target

వేంకటరాయశాస్త్రి, వేదము, 1853-1929

ప్రియదర్శికా నాటిక / వేదము వేంకటరాయశాస్త్రి.- మదరాసు : జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల, 1910.

40, 4 p. ;21 cm.

Record no. 185

Vēṅkaṭarāyaśāstri, Vēdamu, 1853-1929

Priyadarśikā nāṭika / Vēdamu Vēṅkaṭarāyaśāstri.- Madarāsu : Jyōtiṣmatī Mudrākṣaraśāla, 1910.

40, 4 p. ;21 cm.

Record no. 185

2102

FEB [illegible] 1940	3.2.54.
[illegible] 5-1940	17.3.54
27.4.43	30.6.54
4.6.43	21.1.55
11.10.43	21.10.66
16.10.43	8.3.78
23.7.44	29.11.79
5.12.44	
3-2-46	
13-10-46	
29.11.46	
22.1.47	
15 2 47	
14-2-48	
[illegible].9.49.	
25.10.49.	
30.10.51	

ప్రియదర్శికా నాటిక.

శ్రీహర్షకృత సంస్కృతనాటికకు సరిగా

వేదము - వేంకటరాయశాస్త్రి చే

తెనుగున రచింపఁబడినది

జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల.

మదరాసు.

1910.

దీనివెల 6 అణాలు.] [Price 6 Annas.

విజ్ఞప్తి.

శృంగారసగుళికయనం దగు శ్రీహర్షుని ప్రియదర్శికానాటిక సూక్ష్మములో మోక్షమన్నట్లు చిఱుతుకతనముతోనే రసవత్తరం బగుటం గాంచి దానిని ఆంధ్రులగు రసజ్ఞుల పరితోషార్థమయి ఆంధ్రంబున రచించినాఁడను.

మఱి యిందలి సంవిధానసౌభాగ్యము ఏతన్మూలము లయినబృహత్కథాకథాభాగముల నెఱుంగనివారికి సుగ్రహము గాదు గావున, వానిని ఇందుం బొందుపఱిచినాఁడను.

వేదము - వేంకటరాయశాస్త్రి.

మూలకవిప్రశంస.

ఈనాటికను, రత్నావళీనాగానందములను, ధావకుఁడు (భాసకుఁ డొండె) అనుకవి రచించి తన కాశ్రయుఁడైన శ్రీహర్షమహారాజు రచించినట్లు ప్రకటించినాఁ డని ఆభాణకము కలదు.

ఈ ధావకుఁడు ఇరువదింటి కెక్కుడు నాటకములు రచించినట్లును అందు కరుణ రసప్రధాన మైనది కిరణావళి యను పేరిటిది ఒకటి యుండె ననియు రాజశేఖరకవికృత గ్రంథమువలనం దెలియ నగుచున్నవి.

ఈధావకుఁడు చాకలి యనియు, ఘటకర్పరశబ్దఘటితాంత మయిన యొకానొక చిన్ని కావ్యమును రచించినకతంబున నితనికి ఘటకర్పరుఁ డనినామాంతరముగలిగె ననియు,

> "ధన్వన్తరి క్షపణ కామరసింహ శఙ్కు
> బేతాళభట్ట ఘటకర్పర కాళిదాసాః
> ఖ్యాతో వరాహమిహిరో నృపతే స్సభాయాం
> రత్నాని వై వరరుచి ర్నవ విక్రమస్య."

అని పరిగణితు లయినవిక్రమార్కునవరత్నములలో నొకఁడనియును కొందఱు చెప్పుదురు.

మఱియు పూర్వోక్తశ్రీహర్షుఁడు క్రీస్తుశకమునకు ముందు (56-వ సంవత్సరము నుండి) శకప్రవర్తకుఁ డయిన యుజ్జయినీపతి శ్రీవిక్రమాదిత్యుఁడే యనియు, ఆయనకు శ్రీహర్షుఁ డనినామాంతర మనియు కొందఱును, క్రీ. శ. ఏడవశతాబ్దమున కన్యాకుబ్జము నేలిన హర్షవర్ధనుఁ డని యొకకొందఱును, వీ రిరువురుం గా రనియు తానేశ్వరాధీశ్వరుఁ డైన శ్రీహర్షుఁ డని మఱికొందఱును అభిప్రాయపడియున్నారు.

వత్సరాజు పూర్వచరిత్రము (కథాసరిత్సాగరము.)

తొల్లి ఉదయనుఁ డనురాజు పాండవవంశ్యుఁడు వత్సదేశమును కౌశాంబీనగరము రాజధానిగా నేలుచుండెను. అతఁడు బాల్యమునందు వాసుకియన్నను వసునేమి యను నాగుని ఒకపాములవానిచేతినుండి విడిపింపఁగా నాగుఁ డాకృతజ్ఞతచేత నతనికి ఘోష వతి యను నొక యద్భుతవీణ నిచ్చెను. దానివాదనముచేతను తనపాటచేతను వత్సరాజు అడవిలో గొప్పగొప్ప యేనుఁగులను ఎలయించి కట్టి తెచ్చుచుండెను.

ఉజ్జయినీపతి మహాసేనుఁడు చండికను గూర్చి తా నొనర్చిన చండోపాసనచే ఆమెవలన చండమహాసేననామమును పొందినవాఁడు అంగారకాసురునికుతను అంగారవతిని పరిణయమై ఆమెవలన గోపాలకుఁడు పాలకుఁడు నని యిరువురుపుత్త్రులను వాసవునివరమువలన అసమానలావణ్యను వాసవదత్త యనుకూఁతునుం బడసెను. ఆమెకు

పెండ్లియీడు రాఁగా చండమహాసేనుఁడు, ఆమెకు తగినవరుఁడు తన శాశ్వతవైరి యయినవత్సరాజు దక్క వే ఱొకఁడు లేమి నెఱింగి, మెలపున నతని వశపఱుచుకొనువాఁడై, వత్సరాజును తనయింటికి వచ్చి తనకూఁతునకు గాంధర్వవిద్య నేర్పవలయు నని దూతముఖముగా నడిగెను. మంత్రులబోధనచేత వత్సరాజు తనకడకే శిష్యనుగా కూఁతును పంపవచ్చు నని చండమహాసేనునికి ప్రతిసందేశము పంపెను.

అంతట చండమహాసేనుఁడు వత్సేశునిగజగ్రహణవ్యసన మెఱిఁగి యతనిం బట్టుకొన సాటిలేనిజంత్రపుటేనుఁగును చేయించి దానికడుపులో వీరపురుషులను దాఁచి యుంచి వింధ్యారణ్యములో నిలిపించెను. వేఁటగాండ్రవలన ఆయేనుగునుగూర్చి విని వత్సరాజు దానిం బట్టువాఁడై తరలి అది బెదరు నని దండును దూరమున నిలిపి ఒంటిగా దరిసి దాని నెలయింప ఘోషవతిని వాయించుచు సంగీతముచేసెను. అదియు వాస్తవ గజమువోలె చేష్టించుచు గీతాకృష్టమువోలె దరియుచు, యదృచ్ఛచేతనుంబోలె నెడయుచు, అతని నేకాకిని గహనమున కెలయించెను. అంతట దానికడుపునుండి తలుపులు తెఱచుకొని వీరపురుషులు దుమికి అతనిం బట్టి యుజ్జయినికిం గొనిపోయిరి. చండమహాసేనుఁడు ఎదురువచ్చి సత్కరించి సంకెలల వైచియు, 'ఓప్రభూ, ఈమెకు సంగీతము నేర్పుము, పిమ్మట నీకు కల్యాణ మగును, చిత్తమందు ఆయాసపడకుము,' అని చెప్పి, వాసవదత్తను శిష్యఁగా నప్పగించెను. ఈప్రసక్తిచే వాసవదత్త వత్సేశుని వలచి యతనికై యేసాహసమేనియుం జేయ సిద్ధపడి యుండెను.

ఇంతలో వత్సేశునిమహామంత్రి యౌగంధరాయణుఁడు రాజ్యము రుమణ్వాదుల కప్పగించి వచ్చి, తనయోగవిద్యా ప్రభావముచేత తనకును వసంతకునికిని మాఱురూపులు గావించికొని, ఉజ్జయినిం జొచ్చి, ప్రభువునకు వినోదార్థమై వసంతకుని తత్సన్నిధికిం బంపెను. అనంతరము తాను వలసినయేర్పాట్లు గావించి అదృశ్యకరణిచే రాచనగరు సొచ్చి వత్సరాజుం గాంచి యాతని నిట్లు హెచ్చరించెను:—'రాజా, నిన్ను చండమహాసేనుఁడు మాయచేత పట్టి తెచ్చినాఁడు; నిన్నితఁడు కొమారిత నిచ్చి సమ్మానించి విడిపింపఁ దలఁచి యున్నాఁడు; కనుక ఇతనికొమారితను మనము స్వయముగా హరించి కొనిపోవుదము. ఇందువలన నితనిగర్వమునకు తగినప్రాయశ్చిత్త మగును. మనకు పౌరుషము లేదనులాఘవము కలుగకుండును. ఇతఁడు కొమారితకు భద్రవతి యను నొక యేనుఁగును ఇచ్చియున్నాఁడు. దానివేగమును పట్టుసామర్థ్యము నడగిరికి తప్ప మఱి యేయేనుఁగునకును లేదు. దానిని చూచినయెడల నడగిరి దానితో యుద్ధము చేయనే చేయదు. దానిమావటీని ఆషాఢకుఁ డనువానిని నేను విస్తారముధన మిచ్చి స్వాధీనపఱుచుకొని యున్నాను. కావున వాసవదత్తాసమేతుఁడవై సాయుధుఁడవై ఆయేనుఁగు నెక్కి రాత్రి రహస్యముగా వెడలిపోవలసినది.' ఇట్లు చెప్పి యౌగంధరాయణుఁడు వెడలిపోయెను.

అనంతరము వత్సరాజు ఆపన్నాగమును వాసవదత్త కెఱుకపఱిచెను. ఆమె యాషాఢకునిం బ్రయాణసన్నాహమున కాజ్ఞచేసెను. రాత్రి ఆషాఢకుఁడు భద్రవతిని సన్నాహముచేసి తెచ్చెను. వత్సరాజు యౌగంధరాయణోపదిష్టయోగములచే సంకెలలూడ్చుకొని ఘోషవతిం గైకొని, తానును వసంతకుఁడును వాసవదత్తయు ఆమెనెచ్చెలి కాంచనమాలయు ఆషాఢకుఁ డైదవవాఁడుగా ఆమత్తహస్తిని నెక్కి, అదియప్పుడు ప్రాకారమును పగులఁగొట్టి చేసినదారిగుండ వెలువడి పహరావీరులను సంహరించి వేగముగా పయనము సాగించెను.

అంతట పట్టణమెల్ల గందరగోళపడఁగా వృత్తాంత మెఱిఁగి పాలకుఁడు నడగిరి నెక్కి వీరిని వెంటఁ దఱిమెను. వత్సరాజు వానిపై అంపవాన గురియించెను. భద్రవతిని నడగిరి కొట్టఁ దాయెను. ఇంతలో గోపాలకుఁడు వచ్చి తమ్ముని యుద్ధమునుండి నివారించి తోడ్కొనిపోయెను. అనంతరము వత్సరాజు నిరాతంకముగా పయనము సాగించి వింధ్యారణ్యములో తనమిత్రుఁడు పుళిందకుని పల్లియలో విశ్రమించి క్రమక్రమముగా కౌశాంబిం జేరి అచటివారికెల్ల నేత్రోత్సవము గావించెను. అనంతరము గోపాలకాదులు వచ్చి వత్సరాజునకు వాసవదత్త నిచ్చి యథావిధిగా వివాహమహోత్సవము జరిపిరి.

ఈనాటికలోనికథ బృహత్కథయందలి (కథాసరిత్సాగరమునందలి) బంధుమతీ చరిత్రముపోలికను కల్పింపఁబడినది. ఆచరిత్ర యెట్లనః —

బంధుమతి కథ.

ఒకప్పుడు గోపాలకుఁడు తాను బాహుపరాక్రమముచే పట్టితెచ్చిన బంధుమతి యనునొక రాజకన్యను వాసవదత్తకు కానుక పంపెను. ఆమెను వాసవదత్త మంజులిక యని మాఱుపేరు పెట్టి దాఁచి యుంచెను. రాజు ఒకనాఁడు బంధుమతిని చూచి వసంతకునిసాహాయ్యముచేత ఏకాంతముగా ఉద్యానవనములో నొకపొదరింట లావణ్యసముద్రములోనుండి యుద్భవించిన యపరశ్రీనిం బోలెగాంధర్వవిధిచేత వివాహమాడెను. దానిని చాటునుండి చూచి కోపగించి వాసవదత్త వసంతకుని చెఱ నుంపించెను. వత్సరాజు ఆమె పుట్టినింటినుండి వచ్చియున్న యొకపరివ్రాజికను సాంకృత్యాయని యనునామెను శరణుఁ జొచ్చెను. ఆమెమాటలచేత అలుకతీఱి వాసవదత్త బంధుమతిని భర్తకిచ్చి వసంతకుని చెఱ విడిపించెను. పతివ్రతల మనస్సు మృదువుగదా.

ఈ బంధుమతీ గోపాలక మంజులికా లతాగృహములకు బదులు నాటికలో ప్రియదర్శికా విజయసే నారణ్యికా దీర్ఘికలు. కడమవిషయ మెల్ల రెంటనుం గలదు.

నాటక పాత్రములు.

పురుషులు.

సూత్రధారుఁడు.		
వినయవసువు.	... ...	అంగరాజుకంచుకి.
ఉదయనుఁడు.	... ...	వత్సరాజు, కథానాయకుఁడు.
వసంతకుఁడు	... ...	విదూషకుఁడు.
రుమణ్వంతుఁడు.	... ...	ఉదయనుని యమాత్యుఁడు.
విజయసేనుఁడు.	... ...	,, సేనానాయకుఁడు.
దండమహాసేనునికంచుకి.		

స్త్రీలు.

యశోధర.	... ...	ప్రతీహారి.
వాసవదత్త.	... ...	ఉదయనుని పట్టపుదేవి.
ఆరణ్యిక (=ప్రియదర్శిక).	...	అంగరాజుకూఁతురు, కథానాయిక.
ఇందీవరిక.	... ...	చేటి.
మనోరమ.	... ...	,,
కాంచనమాల.	... ...	,,
సాంకృత్యాయని.	... ...	పరివ్రాజిక.

ప్రథమాంకము.

విజ.—దేవరా, ఇదియు విన్నవించెద:—ఈవిధముగా బంధుపరిజనసమేతముగా వింధ్యకేతువు మడిసినంతట అతని ధర్మపత్నులు అతనితో సహగమనము చేసిరి. ప్రజలు వింధ్యశిఖరముల కెక్కి పలాయితు లైరి. అట్లు పాడైనయాచోట 'అయ్యో! నాయనా! అయ్యో! అమ్మా!' అని దీనముగా విలపించుచు సుందరమూర్తి యొకానొక కన్యక వింధ్యకేతునియింట నుండఁగా అతనికూఁతు రని తలఁచి మేము తెచ్చితిమి, ద్వారమందు ఉన్నది. ఆమెను గూర్చి యేలినవారిచిత్తము.

రాజు.—యశోధరా, పోయి నీవే ఆకన్యను వాసవదత్తకు అప్పగింపుము. అప్పగించి దేవితో చెప్పుము:—'చెల్లెలినిగాఁ దలఁచి నీవే ఎల్లప్పుడును చూచుకోవలసినది. నృత్యగీతవాద్యాదులయందు ఉత్తమకన్యకలకు తగిన దెల్ల నేర్పింపవలసినది. ఎప్పుడు పెండ్లికి తగిన దగునో అప్పుడు మాకు జ్ఞప్తిసేయవలసినది.' అని.

ప్రతీ.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

(నేపథ్యమున స్తుతిపాఠకుఁడు)

శా. లీలామంగళమజ్జనోపకరణాళిం గూర్చి శుద్ధాంతవే
శ్యాలోకం బిపు డాప్రయాసమున డయ్యెం, బయ్యెద ల్జాఱ, గా
రాలోకింబులఁ జన్గవల్ మెఱయుచున్ బ్రత్యక్షమార్గవిమ్రైన్
గ్రాలున్ మజ్జనశాల భర్మకలశౌఘంబు బొందు తా నెత్తె నాన్. ౧౧.

రాజు.—(మీఁదఁగాంచి) ఆహా! ఏమి వేవెలుఁగుల వేలుపు మింటినడిమికి వచ్చినాఁడు! ఇప్పుడు నిశ్చయముగా:—

క. మిడిమెండ కుడుకుడిగ్గియ
బుడగలు నా బేడిస లవె పొరిఁబొరిఁ ద్రుళ్లున్;
గొడుగుగఁ దాల్చు నటనచే
సడలినదానినె కలాపి చయ్యనఁ గుంచెన్. ౧౨.

తే. లేడిలేఁగ తరులగుంపునీడఁ జేరుఁ
బాదులజలం బనుచు నాసపడి రయమున;
విడిచి యేనుఁగుచెక్కిలి వేగిరముగ
చెవితోఁటలోనఁ దుమ్మెద చేరు నిపుడు. ౧౩.

రుమణ్వంతుఁడా, లెమ్ము, లోపలికే పోయి యథోచితక్రియ లొనర్చి జయసేనుని సత్కరించి పంపుదము. [అందఱు నిష్క్రమింతురు.

ప్రథమాంకము ముగిసినది.

ద్వితీయాంకము.

(అంతట విదూషకుఁడు ప్రవేశించును.)

విదూ.—చెప్పింది గదా నాతో ఇందీవరిక, ‘వసంతకుడా, నేడు వాసవదత్తా దేవి ఒక్క ప్రొద్దున్నది. స్వస్తివాచనానికోసం నిన్ను పిలుస్తూ వున్నది’ అని. కనక ధారాగృహోద్యానంలో డిగ్గియలో స్నానంచేసి దేవియొద్దికి వెళ్లి హుళిక్కిస్వస్తి పఠిస్తాను. ఆలాగు గాకపోతే, మావంటి బ్రాహ్మలకు రాచనగరిలో ప్రతిగ్రహమెక్కడిది! (తెరవంక చూచి) ఓహో! ఇడుగో ప్రియవయస్యుడు నేడు దేవిని యెడబాసిన దుఃఖాన్ని మరవడానికి ధారాగృహోద్యానానికి తరలినాడు. కనక వయస్యునితో గూడానే వెళ్లి నే ననుకొన్నట్లు చేస్తాను.

(అంతట రాజు తమకముతో ప్రవేశించును.)

రాజు.—

ఉ. సోలుచు, క్షీణయై నుడువ స్రుక్కుచు, శోభనమాత్రభూష యై,
పాలినమోముఁదామరఁ బ్రభాతసుధాంశుసిరిన్ హరించుచున్,
దాలుచునొక్కప్రొద్దుకతనన్ గర ముత్కలికన్ వహించుప్రో
యాలిని నూత్నరాగజదశాంచితఁ బోలెఁ గనంగఁ గోరెదన్. ౧౪.

విదూ.—(దరిసి) శుభం నీకు; వర్ధిల్లు.

రాజు.—(చూచి) వసంతకా, ఏల యింత సంబరము?

విదూ.—పూజిస్తుంది గదా దేవి బ్రాహ్మణ్ని.

రాజు.—అటయిన నీ కేమి కలదు?

విదూ.—(గర్వముతో) ఓయి బ్రాహ్మడంటే ఎవ డనుకున్నావు? నాలుగు వేదాల ఐదు వేదాల ఆఱు వేదాల సహస్రవేదాల బ్రాహ్మలు వేన వేలు మూగివున్న రాచనగరిలో మొట్టమొదట రాణీగారికల్ల ఎవడు స్వస్తివాచనం పుచ్చుకొంటాడో వాడూ బ్రాహ్మడు.

రాజు.—(నవ్వి) వేదసంఖ్యచేత నే నీ బ్రాహ్మణ్యము తెల్లమయినది. మఱి రమ్ము మహాబ్రాహ్మణుఁడా, ధారాగృహోద్యానమునకే పోవుదము.

విదూ.—నీ యాజ్ఞ.

రాజు.—ముందు నడవుము.

విదూ.—మఱి రా పోదాం. (నడచి పరికించి) వయస్యుడా, చూడు చూడు ధారాగృహోద్యానపుసొంపును. ఇక్కడ తెంపులేక రాలుతున్న నానాజాతుల పువ్వులచేత రాతిబండలు ఎంతకోమలంగా వున్నవో! పూవుల తావికోసరం తుమ్మెదలు గుంపు గుంపుగా మూగబడగా ఆబరువుకు పొగడలున్ను జాజితీగలున్ను విరిగినవి! తామరతావిని మిక్కుటంగా మోసుకొనివస్తూవున్న యీ గాలికి మంకెనమొగ్గలు వికసిస్తూవున్నవి! దట్టమైన యీ చీకటిచెట్లు ఎండదీప్తిని చొరనీకున్నవి!

రాజు.—మిత్త్రమా చక్కఁగా చెప్పితివి. ఎట్లన నిచట:—

ఉ. రాలినవృంతజాలముల రాజిలు వావిలిచెట్లక్రిందటన్
నేల తనుప్రవాళముల నీటొందవన్ రచితం బొకో యనన్;
గాలికి సప్తపర్ణములగంధ మిదే మనచాయ వీచుచున్
బోలికఁ జూపు యూథప సముత్కట దానఝురంపుఁదావితోన్. ౧౫.

మఱియు,

క. తుమ్మెదలు తమ్మిపుప్పొడిఁ
గమ్మఁబసిమియొడలిపూఁతగాఁ దాల్చి, మరం
ద మ్మాని మత్తుగొని గీ
తమ్ములు పాడెడిని వ్యక్తతారిక్తముగాన్. ౧౬.

విదూ.—వయస్యా, దీన్నికూడా బాగా చూడు, చూడు - ఎడతెంపులేక రాలుతున్న పువ్వులచేత ఈ యేడాకులఅరిటి - వాన వెలిశిన వెంటనే నీటిబొట్లు పైయాకుల యంచులలోనుంచి రాలుతూవున్నట్లు శోభిస్తూవుంది.

రాజు.—చక్కఁగా కనిపట్టితివి వయస్యా. ఏల యన నిచట వానకారుతోడి పోలిక మెండుగానే యున్నది. అట్లే:

చ. అడర శిరీషపుష్పమృదులామలశాదహరిత్ప్రదేశముల్
కడిగినపచ్చరాయిసుకఁ గట్టినక్రొన్నెలకట్లకై వడిన్,
త్రోడిమలనుండి జాఱి పడి త్రొట్టినమంకెనపూవురావులన్
బుడమి మహేంద్రగోపశతపుంజితమో యన నొప్పు నిప్పుడున్. ౧౭.

(అంతట చేటి ప్రవేశించును.)

చేటి.—దేవి వాసవదత్త ఆజ్ఞాపించింది:—‘ఒసే ఇందీవరికా, నేడు నేను అగ

స్త్యమహామునికి అర్ఘ్యం ఇయ్యవలెను, గనుక నీవు వెళ్లి వావిలిపువ్వులు త్వరగా కోసుకురా' అని; 'ఈ యారణ్యికగూడా ధారాగృహోద్యానదీర్ఘికలోనుంచి తామరలను వాలుప్రొద్దుచేత ముణతలుపడక ముందే కోసుకొని రావలెను.' అని.— పాపము! ఆరణ్యిక అద్దియ యెక్కడనూ ఎరగదు. కనక దాన్నికూడా తీసుకొని వెళ్తాను. (నేపథ్యమువైపు చూచి) ఇలా రావే, ఆరణ్యికా, ఇలా రా.

(అంతట ఆరణ్యిక ప్రవేశించును.)

ఆరణ్యిక.— (కన్నీళ్లతో తనలో తాను) ఆలాగ అప్రసిద్ధవంశంలో పుట్టి చేటికలను పనిపుచ్చుకొంటూ వుండి, యిప్పుడు నేను ఒకరియాజ్ఞను చేయవలశినదాన్ని ఐతిని గదా! దైవానికి అసాధ్య మే మున్నది? అట్లుగాదు, నాదే యీతప్పితం; ఏలంటే ఇటువంటిదశ కలుగుతుందని యెఱిగిన్ని నేను నాప్రాణాన్ని వదలనైతిని. ఆపని యిప్పుడు చేతునా? వద్దు, అట్లు చేయడం ఇప్పుడు సాధ్యం గాదు. అయినా నాగొప్పవంశాన్ని చెప్పకొనేలాఘువానికి పాలు కానయితిని, ఏమిగతి! పెట్టినపని చేస్తాను.

చేటి.— ఈలా రావే ఆరణ్యికా.

ఆర.— ఇదుగో వస్తున్నా. (శ్రమ మభినయించుచు) ఒసే దూరమా దిగుడుబావి?

చేటీ.— ఇల్లిదుగో వావిలిగుబురుచాటున. రా మఱి దిగుదాం.

[దిగుట నభినయింతురు.

రాజు.— వయస్యా, ఏమి వేఁటే ఏయో పరధ్యాన్నముగానున్నావు? చెప్పచున్నాను గదా వర్షర్తువును మిక్కిలి పోలియున్న దని.

[అడరశిరీష - ఇత్యాది మఱల పఠించును.

విదూ.— (కోపముతో) ఓహోయి నీవు మాత్రం ఇదీ అదీ చూస్తూ పట్టరాని నీ తమకం తీర్చుకొంటున్నావు. మఱి నాకు బాపడికి స్వస్తివాచనవేళ మిగిలిపోతూ వున్నది. కనక నేను దిగుడుబావిలో స్నానంచేసి రాణీగారికాడికి పోతా.

రాజు.— మూర్ఖుఁడా, రానే వచ్చితిమి డిగ్గియదరికి. ఇవ్విధమున అనేకేంద్రియసుఖమును అనుభవించుచుండియు కనిపట్టవైతివి. అట్లే గదా; చూడు:.—

క. వీనులకు విందొనర్చుఁ బ్రి
యానూపురరావహారు లగునంచరొదల్;
ఆనంద మిడుఁ గనులకుఁ ద
టానోకహనివరదృశ్య లగువీచితతుల్. ౧౮.

క. గమ్మన వలచెడుతామర
సమ్ములనెత్తావి ఘ్రాణసమ్మద మొసఁగున్;
అమ్మయశీతమ్ములు వా
తమ్ములు గాత్రమ్ములకు ముద మ్మొదవించున్. ౧౯.

కనుక రమ్ము దిగ్గియకడకు పోవుదము. (నడచి, పరికించి) వయస్యా, చూడు:

తే. చూచినంతనె యెంతయుఁ జోద్య మొప్ప
స్వచ్ఛమును విస్ఫుటాంభోరుహచ్ఛవియును
బ్రమదవనలక్ష్మిదీర్ఘనేత్రం బనంగ
డిగ్గియ ముదం బొసంగు నాడెందమునకు. ౨౦.

విదూ.— (కుతూహలముతో) వయస్యా, చూడు చూడు. ఎవతె మఱి యీమె? పువ్వులచేత జడతుమ్మెదబారు పరిమళిస్తున్నది; పగడపు చిగుళ్లలాంటి ఎఱ్ఱనిచేతులతో సన్నని బుజాలు వెలుగుతున్నవి; వాస్తవంగా ప్రత్యక్షంగా వుద్యానదేవతే సంచరిస్తూ వున్న దనేలాగ అవుపడుతూవుంది.

రాజు.— (కుతూహలముతో కాంచి) వయస్యా, ఈచెలువ సర్వోత్కృష్టకాంతిచే పెక్కుశంకలు గొల్పినది. ఔరా! ఎఱుఁగజాలకున్నాను. చూడు:

చ. బలియిలు వీడి భూమిఁ గనఁ బన్నగకన్యక యేఁగుదెంచెనో?
కలుగదు దాన నిట్టిచెలి, కంటిని నే నలలోకమున్ వృథా;
నెలవెలుఁ గిట్లు రూపు గొని నిల్చెనె? యుండ దెందునుం బవల్;
నలినముఁ గేలఁ దాల్చి సిరి నాఁ దగునీలలితాంగి యెవ్వతో? ౨౧.

విదూ.— (పరికించి) ఇదుగో రాణీగారి పరిచారిక ఇందీవరిక వస్తూవుంది. గనక పొదచాటున ఉండి చూతాము.

[ఇరువురు నట్లు చేయుదురు.

చేటి.— (తామరాకుం గైకొనుట నభినయించుచు) ఆరణ్యికా, నీవు తామరలని కొయ్యి, నేనున్ను ఈతామరాకులో వావిలిపువ్వులని కోశి పొట్లంగట్టుకొని దేవికాడికి వెళ్తాను.

రాజు.— వయస్య, సంభాషణవలె వినఁబడుచున్నది, కనుక హెచ్చరికగా విందము. ఒకవేళ ఆసంభాషణవలననే, ఈకన్య ఎవరో తెల్లముకాఁగలదు.

[చేటి పోవుట నభినయించును.

ఆర.— సకియా, ఇందీవరికా, నావల్ల గాదు నీవు లేక క్షణ మైనా ఇక్కడ ఉండడానికి.

చేటి.— నేఁడు నేను దేవి చెప్పగా విన్నమాటవల్ల, చాలాకాలమే నన్ను బాశి నీవు ఉండవలెను.

ఆర.—(ఖేదముతో) ఏమి చెప్పింది దేవి?

చేటి.—"అప్పుడు నాతో ఆర్యపుత్త్రుఁడు ఆనతిచ్చినాఁడు గదా 'ఈవింధ్యకేతు నికూతురు ఎప్పుడు పెళ్లికి తగిన దవుతుందో అప్పుడు తనకు గ్నప్తిచేయవలెశింది.' అని. కనుక ఇపుడు ఆర్యపుత్త్రునికి గ్నప్తిచేస్తాను, ఆయన దీనికి వరుణ్ణి వెదకడానికి పూను కొంటాఁడు." అన్నది.

రాజు.—(హర్షముతో) ఈ కుమారి ఆవింధ్యకేతునికన్యయా! (వగపుతో) చిర కాలము మోసపోయితిమి మేము. వయస్యా, కన్యకలం జూచుటయందు దోషములేదు; నిశ్చింతగా తిలకింతము.

ఆర.—(రోషముతో) అటయితే పో నీవు. తప్పడుమాట లాడుతున్నావు, నీతో నాకు పని లేదు.

[చేటి అవలి కేఁగి పూవులు గోయుట నభినయించును.

రాజు.— అహహా! ఈధీరతచే గొప్పయింటిపుట్టుక మిక్కిలి తెల్ల మయినది! వయస్యా, ఈరమణి నెమ్మేనిం దాఁకెడుసుఖమున కెవఁడు పాత్ర మగునో వాఁడు గదా ధన్యుఁడు.

[ఆర. తామరలఁ గోయుట నభినయించును.

విదూ.—వయస్యా, చూడు చూడు, ఆశ్చర్య మాశ్చర్యం! విలాసంగా ఈమె కదిలిస్తున్న కేలుజిగురు కాంతి కమ్మడంచేత ఈమె కోస్తున్న కమలను వెల వెలబోతూ వుంది!

రాజు.—అది ఏపాటివింత? (వాస్తవమయినవింత యిదిగో) చూడు చూడు.

మ. అమృతాసారిణి నాఁగఁ గన్నులకు నాహ్లాదంబు గావించుచున్,
సమయంబందుఁ బయోధరాంశుకము స్రస్తం బౌట దృక్పర్వమై,
హిమధామాకృతి యైనయీరమణిచే హేలాగృహీతంబు లీ
కమలంబు ల్ముకుళింపకున్నవి! యదే కన్పట్టుఁ జోద్యంబుగాన్. ౨౨.

ఆర.—(తుమ్మెదలవలనిబాధను అభినయించుచు) అయ్యయ్యో! ఇవి వేఱేపాడు తుమ్మెదలు తామరలకలువల తంపరలనువదిలి వచ్చి మీదబడి నన్ను మరీ యింత బాధిస్తు

వున్నవి. (భయముతో) ఒసే ఇందీవరికా, కావు నన్ను ఈ పాడుతుమ్మెదలు బాధిస్తున్నవి.

[అని పయ్యెదను ముఖమునకు కప్పుకొనును.

విదూ.—వయస్యా, నీకోరికలు కొనసాగినవి. ఈయిందీవరిక రాకముందే నీవు మాటలాడక సమీపించు. నీటిచప్పుడువల్ల కాలినడక నూహించి ఆమె ఇందివరకే వస్తూ వుం దని అనుకొని స్వయంగానే నిన్ను పట్టుకొంటుంది.

రాజు.—బళి! మిత్త్రమా, బళి! సమయోచితముగా నుపదేశించితివి.

[అని ఆరణ్యికచెంతకు నడచును.

ఆర.—(అడుగులచప్పుడు వినుట నభినయించుచు) ఇందీవరికా, త్వరగా రావే. పాడుతుమ్మెదలు నన్ను చీకాకుపెడుతున్నవి.

[అని రాజును పట్టుకొనును. రాజు మెడను కవుఁగిలించుకొనును.

ఆర.—మొగముమీఁది యుత్తరీయమును తీసి రాజునుచూడక తుమ్మెదలను చూచుట నభినయించును.

రాజు.—(తనయుత్తరీయముతో తుమ్మెదలను తోలుచు)

తే. విసువకుము గోల, యీతేంట్లు ముసురుకొనియెఁ
దావికై నీదునెమ్మోముఁదమ్మిమీఁద;
వెండి వెదచల్లదేని నీబెదరుఁజూపుఁ
గలువతంపరసిరి, నవి తలఁగునెట్లు! ౨౩.

ఆర.—(భయ మభినయించుచు) ఏమి! ఇందీవరిక కాదే! (భయపడుచు రాజును వీడి అవలికి జరుగుచు) ఇందీవరికా, త్వరగానే రావే రావే; కాపాడవే.

విదూ.—అమ్మా, సకలలోకాన్ని కాపాడే సమర్థుఁడు వత్సరాజు నిన్ను కాపాడు తుండగా, ఏల చేటిని పిలిచేవు?

[రాజు 'విసువకుముగోల' మొ. మరల పఠించును.

ఆర.— (రాజును గాంచి తమకముతో సిగ్గుతో మనస్సులో) నన్ను నాయన ఇచ్చిన యామహారాజు ఈతఁడా? తగినదే నాయన పక్షపాతం.

[తత్తరపాటు నభినయించును.

చేటి.—చీకాకుపెట్టినాయి గదా పాడుతుమ్మెదలు ఆరణ్యికని. కనక దగ్గిరికి వెళ్లి ఓదారుస్తాను. ఆరణ్యికా, భయపడకు భయపడకు ఇదిగో వచ్చినాను.

విదూ.—ఒయ్యోవు, జరుగు జరుగు; ఇదె ఇందీవరిక వచ్చింది. ఈ వృత్తాంతం గని దేవితో చెప్పుతుంది ((వేలితో చూపి) కనుక ఈ యరిటియింట్లో దూరబడదాం రా.

[ఇరువురును తోట్రుపాటుతో అవలి కేఁగుటను అభినయింతురు.

చేటి.—(సమీపించి) ఆరణ్యికా, తుమ్మెద లీలాగు తప్పుచేయడం వాటి దోషం గాదు. కమలంలాంటి నీమొగానిదే యీ దోషం. (చేయి పట్టుకొని) కనక రా పోదాము. పొద్దు గూకుతున్నది. [పోవుట నభినయింతురు.

ఆర.— (అరఁటి పొదరింటికేసి చూచి) చెలీ ఇందీవరికా, నీటిచఱిమిరిచేత నాకు తొడవొణుకులాగ వచ్చివున్నది; మెల్లిగా వెళ్దాం.

చేటి.—ఆలాగే [అని నిష్క్రమింతురు.

విదూ.—రా వోయి వెలువడుదాం. ఆకెను దోడ్కొని యీ లంజెకూతురు ఇందీవరిక వెళ్లింది. [అట్లు చేయుదురు.

రాజు.—ఏమీ ! పోయినదే! (నిట్టూర్పు పుచ్చి) మిత్త్రమా వసంతకుఁడా, విఘ్నములు లేక అధన్యులకోరికలు ఈడేఱవు సుమా. (చూచి) మిత్త్రమా, చూడు చూడు ;

తే. నోరు మూసికొనియును నీసారసవని
కంటకంబులఁ దాల్చినకారణమున
భామినీమణిమృదుపాణిపల్లవంపు
స్పర్శసమ్మోదమును దేటపఱుచుఁ జూవె. ౨౮.

(నిశ్వసించి) ఏమి యిపుడు ఉపాయము ఆచెలువం గనుటకు ?

విదూ.—ఓయి నీవే బొమ్మను పగలగొట్టుకొని యిపుడు ఏడుస్తున్నావు. బాపనవాణ్ణని నామాట చెయ్యకపోయినావు.

రాజు.— ఏమి నేను చేయనైతిని ?

విదూ.—అప్పుడే పరాకయిందా ? అప్పుడు, మౌనంగాసమీపించ వోయి, అని నేను చెప్పితే, ఘట్టి యిఱకటంలో నీవు ప్రవేశించి లేని పాండిత్యపుబడాయి యొకటి కల్పించుకొని 'విశువకుము కోల యీ తేంట్లు ముళరుకొనియె' అని యింకా ఏవేవో చేదుమాటలు పలికి బెదరగొట్టి యిప్పుడు ఏడుస్తున్నావు. పైగా ఉపాయం అడుగుతావు.

రాజు.—ఏమి యిది ! ఊఱడింపును సయితము బెదరింపనుకొన్నాఁడు మూర్ఖుఁడు!

విదూ.—తెలియనే తెలిశింది ఇందులో ఎవడు మూర్ఖుడో. కానీ, ఈ మాటలకేమి ? ప్రొద్దు గూకుతూవుంది ; రామతి లోపలికిపోదాం.

రాజు.—(చూచి) అహో! పగటికి ముదిమి ముసరుచున్నది. కావున నిప్పుడు—

చ. కమలవనంపుశోభఁ గొని కాంతవలెన్ దినలక్ష్మి యేఁగె, రా
గము రవిమండలిన్ ఘనముగాఁ గన నయ్యెడి నాయెదన్ బలెన్,
కమలినిచెంత నావలెనె కాంతఁ దలంచుచుఁ గోక ముండెడిన్,
సమకొనె నాకుఁ బోలె దివసంబున కంతట నంధకారముల్. ౨౯.

[అని అందఱును నిష్క్రమింతురు.

ద్వితీయాంకము ముగిసినది.

తృతీయాంకము.

(అంతట మనోరమ ప్రవేశించును.)

మనో.—దేవి వాసవదత్త నన్నాజ్ఞాపించింది— 'ఒసే మనోరమా, సాంకృత్యాయని యల్లించే నాటకంగా ఆర్యపుత్రునిదిన్నీ నాదిన్నీ అయిన చరిత్రాన్ని, అందులో ఆడవలసిన మిగతను మీరు వెన్నెలపండుగలో ఆడవలసింది' అని. నిన్న నా నెచ్చెలి ఆరణ్యిక పరధ్యానంలో వేరువిధంగా ఆడింది. నేడున్నూ వాసవదత్తవేషం వేసుకొని అలాగే ఆడితే దేవికి కోపం వస్తుంది. ఎక్కడ దాన్నిచూచి మందలింతును? (చూచి) ఇదుగో ఆరణ్యిక తనలో తానే ఏమో గొణుక్కొంటూ డిగ్గియకాడి యరిటి పొదరింటిలోపలికి పోతూవుంది! కనుక పొదచాటున ఉండి వింటానుగానీ దీని గుట్టుమాటలను.

(అంతట ఆరణ్యిక ప్రవేశించును.)

ఆర.—(కామావస్థను అభినయించుచు, నిశ్వసించి) హృదయమా, అందని పురుషుణ్ని కోరుతూ నీవు ఏల నన్ను దుఃఖంపాలు చేస్తావు?

మనో.—ఇదే అది, దీని పరధ్యానానికి కారణము. కాని, ఎవరిని ఇది వలచింది? హెచ్చరికగా వింటాను.

ఆర.—(కన్నీళ్లతో) ఆవిధంగా అంత సౌమ్యంగా అగపడ్డ మహారాజు ఏల యీలాగు నన్ను కాకపెట్టుతున్నాడు! ఆశ్చర్య మాశ్చర్యం! (నిశ్వసించి) ఆలాగన నేల! నాదే యభాగ్యత్వంగాని మహారాజుతప్పు గాదు.

మనో.—(బాష్పములతో) ఏమీ! మహారాజే యీ మెకు వలవదగినవాడు! బళీ! నెచ్చెలీ, బళీ! నీ గొప్ప పుట్టుకకి తగివున్నది నీకోరిక.

ఆర.—ఎవరితో ఇపుడు ఈ సంగతి చెప్పుకొని యీ వెతను సైపజాలుదును? (ఆలోచించి) కానీ, ఉన్నది నాకు నా హృదయమే అయిన నెచ్చెలి మనోరమ. దానితో సమేతూ ఈరహస్యాన్ని చెప్పడానికి బిడియపడుతూవున్నాను. నిజంగా మరణం దప్ప లేదు నాహృదయానికి వేరే ఊరట!

మనో.—అయ్యయ్యో! పాపం! దీనివలపు మేరమీరి పోయింది. మరి ఇందుకోసం నేనేమి చేతును?

అర.—(అభిలాషతో) ఎక్కడ తుమ్మెదలవల్ల నేను గాసిపడుతూవుండగా నన్ను చేపట్టి మహారాజు 'వెరపరీ భయపడకు' అని ఓదార్చెనో ఆచోటు ఇది.

మనో.—(సంతోషముతో) ఏమీ! దీన్ని మహారాజు చూడడంకూడా సంభవించిందా! తప్పకుండ దీనికి ప్రాణం దక్కడానికి ఉపాయం ఉన్నది. దగ్గిరికి వెళ్లి

దీన్ని ఊరడిస్తాను. (తటాలున దరిసి) చెలీ, ఇసీ, తగునా యీలాగ హృదయందగ్గిరకూడా లజ్జపడడం?

ఆర.—(లజ్జ నభినయించుచు, ఆత్మగతము) అయ్యో! అయ్యో! ఇది అంతా విన్నది. కనక ఇక తెలియచేయడం సరే. (చేయిపట్టుకొని, పెల్లడిగా) నెచ్చెలీ, కోపగించకు కోపగించకు, ఈనేరం సిగ్గుదే గాని నాది గాదు.

మనో.—(హర్షముతో) చెలీ, జంకు మాను, ఇదొక్కటి నాకు జెప్పు, నిజంగా నిన్ను మహారాజు చూచినాడా లేదా?

ఆర.—(లజ్జతో, తల వాంచి) నెచ్చెలి సర్వం వినకనే విన్నది.

మనో.—మహారాజు నిన్ను చూచినాడు గనక నీవు మరి వాగవ నక్కరలేదు. ఆయనే యిపుడు నిన్ను చూడడానికి ఉపాయం చూచుకొంటాడులే.

ఆర.—సకీ, పక్షపాతంచేత పలుకుతున్నావు; దేవి గుణాలు సంకిళ్లలాగ ఆయన్ని కట్టివేశివుండగా ఇది యేలాగ సంభవిస్తుంది?

మనో.—(నవ్వి) ఒసే గోలా, తామరతీగమీద ప్రేమగలదైన తుమ్మెద జాజిని చూసి కొత్తతేనె చవిగొనడానికి నోరూరుతూ దాన్ని బొందక నిలుస్తుందా?

ఆర.—ఏల యీ కొరగానిమాటలు? ఈ శరత్కాలపు టెండకు నా యవయవాలు మరీ మరి కాగిపోయి చల్లబడకున్నవి.

మనో.—ఒసే సిగ్గరీ, యిట్టి యవస్థలోనున్నా, నీవు నీగుట్టు దాచుకోవడం తగదు. [ఆర. మోము వాంచును.

మనో.—ఒసే నమ్మలేనిదానా,—

క. ఊరుపు నెపమున వెలువడు
వారక రేఁబవలు నీదువలవంత చెలీ,
ధారాళముగాఁ బడు మరు
నారసముల ఝుంక్రియానినాదమొ యనఁగాఁ. ౨౬.

(స్వగతము) కానీ, ఇది గాదు సమయం నిందలకి. తామరాకులు దీనియెదపై గప్పుతాను. (లేచి, డిగ్గియనుండి తామరాకులు తెచ్చి ఆరణ్యికహృదయమున నుంచి) సకీ, ఊరడిల్లు ఊరడిల్లు.

(ఛాయ.)

క. ఊరుపునెపాన వెలిబడు వారక రేఁబవలు నీది వలవంత చెలీ,
ధారాళంగా పడు మరు నారాచాల్ ఝుమ్మనేటి నాద మనంగా.

(అంతట విదూషకుఁడు ప్రవేశించును.)

విదూ.—మరీ మరీ గొప్పదిగదా ప్రియవయస్యుడికి ఆరణ్యికమీద అనురాగం! అందువల్ల రాచకార్యాలన్నీ వదిలేశి ఆమెనే చూడడానికి ఉపాయం వెతుకుతూ మనస్సు వినోదపెట్టుకొంటున్నాడు. (ఆలోచించి) కనక ఎక్కడ ఇప్పుడు ఆమెను కనుక్కొందును. కానీ, అక్కడనే డిగ్గియదగ్గిరనే వెదుకుతాను. [అని నడచును.

మనో.—(విని) అడుగుల చప్పుడులాగ వినబడుతూవుంది. అరటిపొదచాటున ఉండి ఈతడెవడో చూతాం.

[ఇరువురు అట్లు చేసి చూతురు.

ఆర.—ఏమీ! అతఁడే, మహారాజుతో వుండే బ్రాహ్మడు.

మనో.—(చూచి), ఏమి! వసంతకుడు! (సంతోషముతో, తనలో) మతి అవునా?

విదూ.—(దెసలు పరికించి), ఏమి ఇపుడు ఆరణ్యిక వాస్తవంగానే ఆరణ్యిక అయిందా?

మనో.—(చిఱునవ్వుతో) సఖీ, ఏలినవారిచెలికాడు బ్రాహ్మడు నిన్నుగుఱించి పలుకుతున్నాడు; కనుక అక్కరతో విందాం.

[ఆరణ్యిక ఆసతోను లజ్జతోను వినును.

విదూ.—(వెఱపుతో) భరింపరాని వలరాచకాకకు వాడిలిపోతూ నన్ను ప్రియవయస్యుడు పంపితే నేను వాసవదత్తాదేవి పద్మావతీదేవి కడమదేవేరులు ఈయుండటి నగళ్లున్ను వెతికినాను గాని ఆరణ్యిక ఎక్కడా లేదు. అంతటితో ఇక్కడ సమేతూ చూతామని వచ్చినాను. కాని, యిక్కడానూ లేదాయెను, ఇక నిపుడేమి చేతును?

మనో.—వింటివా నెచ్చెలీ?

విదూ.—(ఆలోచించి) కానీ, వయస్యుడు నాతో చెప్పనే చెప్పినాడు, 'చెలిని వెదకినన్నీ గానవేని, అంత ఆకొమ్మయొక్క కెంగేలితాకుడుచే ఇమ్ముగా చలిమిరిగమ్మే తామరాకులు గొనితెమ్మా' అని. మరి వాటి నేలాగున కనుక్కొందును?

మనో.—ఇదే నాకు సమయం. (సమీపించి విదూషకునిచేయి పట్టుకొని) వసంతకా, రా నేను ఎఱుకపరుస్తాను.

విదూ.—(భయముతో) ఎవరికి నీవు ఎఱుకపరుస్తావు? దేవికా ఏమి? నే నేమీ అనలేదే!

మనో.—వసంతకా, భయపడకు. ఆరణ్యికకోసం నీ నేస్తకాడి వెత యెటువంటిదిగా వర్ణించినావో, దానికి రెండింతలుగా నున్నది మహారాజుకోసం నా నెచ్చెలి వెత; చూడు చూడు. [సమీపించి ఆరణ్యికను చూపును.

విదూ.—(కని, స్వగతము) నాప్రయాస ఫలించింది. (ప్రకాశము) అమ్మా నీకు క్షేమం.

[ఆర. లజ్జించుచు తామరాకులం దొలఁగించి నిలుచుండును.

మనో.—(చిఱునవ్వుతో) వసంతకయ్యా, నిన్ను చూశినమాత్రాననే నెచ్చెలి కాక తీరిపోయింది; తీరకపోతే స్వయంగానే తామరాకులని ఏల తోశేస్తుంది! మరి వీటిని పుచ్చుకోవయ్యా.

ఆర.—(తత్తరముతో) ఏమే వేళాకోళం మానవు? ఏల నన్ను సిగ్గుపరుస్తావు?

[ఇంచుక పెడమొగం బయి నిలుచును.

విదూ.—(విషాదముతో) తామరాకుల మాట అటుండనీ. నీనెచ్చెలి శానా సిగ్గరి. ఈలాగైతే వీరికి పొందు ఏలాగ ఘటిల్లుతుంది?

మనో.—(క్షణ మాలోచించి, సంతోషముతో) వసంతకయ్యా, ఈలాగ.

[చెవిలో చెప్పను.

విదూ.—బళీ! మనోరమా, బళి! (అపవారించి) మీరు పోయి వేషము దాల్చేటప్పటికే నేనున్ను ప్రియవయస్యుణ్ని తోడ్కొని వస్తాను.

మనో.—ఎంత కోపమే! లేవే లేవే. ఆనాటకంలోనే ఆడవలిశిన మిగత ఘనం ఆడవలెగదా. గా మఱి నాటకశాలకే పోదాం. (నడచి, చూచి) ఇదే నాటకశాల. రా ప్రవేశింతాం. (ప్రవేశాభినయముతో చూచి) దీన్ని అప్పుడే చక్కగా సిద్ధం చేశినారు గనక, దేవి వచ్చేసమయం ఐంది.

(అంతట దేవియు సాంకృత్యాయనియు విభవంబుగా పరివారంబును ప్రవేశింతురు.)

వాస.—భగవతీ, ఎంతవింతగా నున్నది నీకవనము! ఎట్లంటే, ఈకవనంచేత ఈ వృత్తాంతం మాయార్యపుత్త్రుడి చరిత్రమే నాటకంగా అల్లినటువంటిది నాకు అనుభవమే అయినా, చూచేటప్పుడు మును పెప్పుడున్ను చూడనిదానిలాగ ఆశ పుట్టిస్తూ వుంది.

సాంకృ.—ఆయుష్మతీ, నీరసకావ్యము సయితము వినువారివీనులకు విందొనర్చుట ఆశ్రయప్రభావము గాని యొండు గాదు. కనుము,-

క. ఎదియును దానస దయ్యును
నొదవినమహదాశ్రయమున నొందును మహిమన్;
మదగజకుంభగతం బై
పొదలదె బూదియును బొరసి భూషణపదవిన్? ౨౭.

వాస.—(చిఱునగవుతో) భగవతీ, తెలుస్తూనే ఉంది అల్లుడు ఎల్లవారికిన్నీ వల్లభుడని. ఏల యీప్రస్తావం పెంచడం? ఆనాట్యం చూడడమే మేలు.

సాంకృ—అవును. ఇందీవరికా, నాటకశాలకు దారి చూపుము.

చేటీ.—దేవి ఇటు రావలె. [స్త్రీలందఱు నడతురు.

సాంకృ.—(చూచి) అహో నాటకశాల యెంత కన్నులపండువుగా నున్నది!

తే. వలుదముత్తెంపుఁ గలువడంబులను దాల్చి
రతనపుంబైఁడికంబముల్ రాజిలంగ,
అచ్చరల మించుజవ్వను లధివసింప,
సురవిమానంబుగతి నొప్పెఁ జూపుటిల్లు. ౨౮.

మనో. ఆర.—(సమీపించి) జయం జయం దేవికి.

వాస.—సంజ దాటిపోయింది. మఱి పొండి, త్వరగా వేషాలు వేసుకోండి.

ఇరువురు.—దేవియాజ్ఞ. [అని యిరువురును తరలుదురు.

వాస.—ఆరణ్యికా, వీటిని నావొంట నేనుపెట్టుకొన్న ఈ యాభరణాలని పుచ్చుకొని నేపథ్యగృహానికి వెళ్లి వీటినే నీవు అలంకరించుకో, (అని ఆభరణములను ఒడలి నుండితీసి యిచ్చి) మనోరమా, నీవున్ను మానాయన ఆర్యపుత్త్రుడికి నలగిరిని పట్టినందుకోసం మెచ్చుకొని యిచ్చిన యాభరణాలని ఇందీవరిక చేతినుంచిపుచ్చుకొని నేపథ్యగృహానికి వెళ్లి వాటిని నీవు అలంకరించుకో; ఆలా చేస్తే మహారాజును సరీగా సరిపోల్తావు.

[మనో. ఇందీవరికయొద్దనుండి నగలం గైకొని ఆరణ్యికతో నిష్క్రమించును.

ఇందీ.—ఇదుగో ఆసనం, దేవి కూర్చోవచ్చును.

వాస.—(ఆసనముం జూపి) భగవతిన్ని కూర్చుండవలె.

[ఇరువురును కూర్చుండుట నభినయింతురు.

(అంతట వేసము దాల్చిన కంచుకి ప్రవేశించును.)

తే. భవ్యత నొనర్తు నంతఃపురవ్యవస్థఁ;
గనుదుఁ బ్రతిపదమునను సంస్ఖలితములను,
దండసితిని జక్కఁగా దాల్చి నడుతు,
మొనసె నృపవృత్త మెల్లను ముదిమి నాకు. ౨౯.

తనదండు శత్రువుల నెల్ల ఓడించినందున అన్వర్థనామధేయుఁడైన మహాసేన మహారాజు—రేపు మేము మదనోత్సవ మనుభవించెదము, అందులకు ఉత్సవమునకుం

దగినవేషముచే వెలుఁగొందెడి పరిజనముతోఁ గూడ మీరు మన్మథోద్యానమునకు రావలసినది;— అని, రాణివాసములకు తెలుపుడు సేయు మని నన్ను ఆజ్ఞాపించినాఁడు.

సాంకృ.—(కంచుకిని చూపి) ఆట ఆరంభమయినది; చూతుము.

కంచు.—అయినను, పరిజనముతో రావలసినది అని తెల్పినం జాలును, 'వేషముచే వెలుఁగొందెడి' యన నక్కఱలేదు. ఏలన:

ఉ అందెలు కాళ్ల, శింజతసమంచితకాంచిక శ్రోణిమండలిన్,
సందిట బాజబందులుఁ, గుచస్థలి బన్నసరంబులున్, శిరం
బందును నాగరంబుఁ, జెవులందును గమ్మలునున్ జ్వలించెడున్
గ్రందుగ రాణిగార్ల యుడిగంపుఁ దుటారి మిటారి పాళికిన్. 30.

ఇట క్రొత్తగా చేయవలసినది ఏమియు లేదు. కేవలము ప్రభువునానతి యని తలఁచి నేను నాకు నియమింపఁబడిన యాయాజ్ఞాశేషమును రాజకుమారి కెఱుక చేసెదను. (అని నడచి, చూచియు) కేల వీణియం గొని కాంచనమాల వెంట రా ఇదిగో వాసవదత్త సంగీతశాలం జొచ్చినది. ఈమెతో చెప్పెదను. [అని నడచును.

(అంత వాసవదత్తావేషము దాల్చి ఆసనమందు గూర్చున్నదిగా ఆరణ్యికయు వీణం గేలఁ గొని కాంచనమాలయు ప్రవేశింతురు.)

ఆర.—ఒసే, కాంచనమాలా, ఏల మఱి విలంబిస్తున్నాడు నేడు వీణాగురువు?

కాంచ.—భర్తృదారికా, ఆయన ఒక వెఱ్ఱివాణ్ని చూచినాడు, వాడిమాటలు విని వింతపడి నవ్వుతూ ఉన్నాడు.

ఆర.—(చప్పట్లు చఱచుచు, నవ్వి) ఒసే, చక్కనిమాట సుమా 'సమానులు సమానులమీద అనురక్తు లవుతారు' అన్నమాట. ఇద్దరున్ను ఇందులో ఉన్మత్తులే గదా.

సాంకృ.—రాకుమారీ, నీపోలికగా ఈమెయాకారము నా కగపడుచున్నది. అట్టి యాకారముతో తప్పకుండ నీవేషమును చక్కఁగా నెఱవేర్చును.

కంచు.—(సమీపించి) రాజపుత్త్రీ, ఏలినవారు నిన్ను ఆజ్ఞాపించినారు 'రేపు తప్పక మేము నీవీణావాదనమును వినవలయును. అందుకై నీవు తొమ్మిదితంతులుకట్టిన ఘోషవతిని కొనిరావలయును' అని.

ఆర.—అయ్యా, అలాగైతే వెంటనే మావీణాగురువును పంపు.

కంచు.—ఇదె వత్సరాజును పంపెదను. [అని నిష్క్రమించును.

[కాంచ.—వీణ నిచ్చును. ఆర.—వీణను ఒడిలోపెట్టుకొని తంతులను తుడుచును.

ఆర.—కాఞ్చనమాలా, నా చేతి కీవే ఘోషవతిని, దానితంతులు పరీక్షిస్తాను.

(అంతట వత్సరాజు వేసమున మనోరమ ప్రవేశించును.)

మనో.— (స్వగతము) తామసిస్తున్నాడు మహారాజు. చెప్పలేదేమో వసంతకుడు? కాకపోతే ప్రభువు దేవికి వెరుస్తున్నాఁడా? ఇప్పుడు వస్తే బాగా ఉంటుంది.

(అంతట రాజును, బురఖా వేసికొని విదూషకుఁడును, ప్రవేశింతురు.)

రాజు.—

ఉ. ఇప్పుడె పూర్వరీతిఁ దపియించుట మానె ననుఁ సుధాకరుం,
డిప్పుడె మానె మోవి నలయించుట మున్వలె వేఁడియూరుపుల్,
ఇప్పుడె రిత్త గాదు మది, యిప్డె యమందము లయ్యె నంగముల్ !
తప్పెడుఁ జూవె కోర్కులను ధ్యానము సేసెడుమాత్రకే వగల్. ౩౧.

వయస్యా, నిజమేనా మనోరమ చెప్పినమాట? ఏమనఁగా—'ఇదె ఈనా నెచ్చెలిని మహారాజుకంటిదారిలో నేనియు పడనీయక దేవి కాపాడుచున్నది. దానంజేసి సమాగమమునకు ఇదిగో ఉపాయము: ఈ రాత్రి మేము ఉదయనచరిత మను నాటకమును దేవిముందల నాడెదము. అందు ఆరణ్యక వాసవదత్తా వేషము వేసికొనును, నేనను వత్సరాజ నయ్యెదను; అతని చరితమును బట్టియే సర్వమును ఆడవలయును: కావున ఆయన తానే వచ్చి తనవేషమును నెఱవేర్చి సమాగమోత్సవము ననుభవించుఁగావుత.' అని ?

విదూ.— నామాటలో నమ్మకం లేకుంటే, ఇదుగో మనోరమ నీ వేషం వేసుకొని వున్నది, దగ్గిరికి పోయి నీవే అడుగు.

రాజు.—(మనోరమకడకుం జని) మనోరమా, నిజమే వసంతకుఁడు చెప్పినది?

మనో.— దేవా, నిజం. ఈ నగలను అలంకరించుకో.

[అని నగలను తన యొడలినుండి తీసి యిచ్చును. రాజు ధరించును.

విదూ.— ఈ రాజులను దాసీ సమేతూ ఇలాగ ఆడిస్తుంది! ఆహా! కార్యగౌరవం!

రాజు.—(నవ్వి) మూర్ఖుఁడా, ఇది కాదోయి సమయము ఎగతాళికి. రహస్యముగా చిత్రశాలకుఁ బోయి మనోరమతోఁ గూడ మాయాటను చూచుచుండుము.

[విదూ.— అట్లు చేయును.

ఆర.— కాంచనమాలా, వీణను ఉండనీ, ఒక మాట అడుగుతాను చెప్పు.

రాజు.— వినియెదఁగాక, సందర్భము ఏదిగా నున్నదో అని. [అక్కఱగా వినును.

కాంచ.— అడుగు భర్తృదారికా.

ఆర.— నిజంగానే నాయన చెప్పినాడా? ఏమనంటే— 'వీణ వాయింపిస్తూ వత్సరాజు నన్ను మెప్పిస్తే, తప్పకుండా విడిచిపెడ్తాను' అని.

రాజు.—(అపటీక్షేపంబునం బ్రవేశించి, సంతసముతో వలువయంచున ముడివైచి) సరియే ఇది. సందేహ మేమి ?

తే. పరిజనాన్వితుఁ బ్రద్యోతు వెరఁగువఱిచి,
వీణ వాయించుచును మహా విభ్రమమునఁ,
జూడుఁ డిందుల సందేహ మేడ ? నేఁడ
దక్కఁ గొనిపోదు వాసవదత్త నేను. 3౨.

ఎట్లన, యౌగంధరాయణుఁడు సకలమును చక్కఁగా ఏర్పఱిచి యున్నాఁడు.

వాస.—(తటాలున లేచి) జయం ఆర్యపుత్త్రుడికి.

రాజు.—(స్వగతము) ఇఁక నెట్లు? దేవి నన్ను తెలిసికొన్నదే!

సాంకృ.— ఏల తొట్రుపాటు ? ఆటయే గదా యిది!

వాస.—(వెడనవ్వు నవ్వుచు కూర్చుండి) ఏమి! మనోరమ గదా యిది. ఆర్యపుత్త్రుడే అని నే ననుకొన్నాను. బళీ మనోరమా, బళి! చక్కగా ఆడినావు.

రాజు.—(సంతోషముతో, తనలో,) ఇప్పుడు నాదిగులు తీఱినది.

సాంకృ.— రాజకుమారీ, మనోరమ యీ భ్రాంతిని కలిగించుట యుక్తమే.

?నుము.—

మ. అదియే రూపము నేత్రపర్వ ! మదియే యాజ్జ్వల్యవద్వేష ! మ
ల్లదియే మత్తగజోచితంబు గమనం ! భాసత్త్వమే యూర్జితం !
బదియే లీల ! స్వరంబు నల్లదియె సాంద్రాంభోదనిర్హ్రాది ! మేల్ !
చదు రొప్పం గనిపించె నీచెలువ సాక్షాద్వత్సభూనాయకుఁ. 33.

వాస.— ఒసే, ఇందీవరికా, సంకెళ్లలో ఉండి ఆర్యపుత్త్రుడు నాకు వీణ నేర్పినాడు. అందుచేత ఈయనకు నల్లగలువదండతో సంకెళ్లు వేయవే.

[అని తలనుండి తీసి నల్లగలువలదండను ఇచ్చును. ఇందీవరిక అట్లుచేసి వెండియు మునుపటివలెనే కూర్చుండును.

ఆర.— కాంచనమాలా, చెప్పు, చెప్పు, మరి నిజంగా మానాయన ఈమాట చెప్పెనా 'వీణావాదనముతో నన్ను వత్సరాజు అపహరించినట్టయితే అంతట తప్పక విడుస్తాన' ని?

కాంచ.— భర్తృదారికా, నిజమే. నీ వున్న ఏలాగ చేస్తే వత్సరాజు నిన్ను మెచ్చుకొంటాడో ఆలాగ చేయి.

రాజు.— మేము చెప్పవలసిన దానిని కాంచనమాల చక్కఁగా నెలకొల్పినది.

వాస.—అపస్థాన అక్కరతో వాయిస్తాను. [పాడుచు వాయించును.

క. ఘన బంధన రుద్ధంబును
గని యాకాశమును దనదుకాంతను దనతా
పునరుక్ మానసమునరుక్
గొని చన రాయంచకొదమ కోరికపడెడిన్. ౩౪.

[విదూ.—నిద్ర నభినయించును.

మనో.—(చేతితో కదలించుచు) వసంతకా, చూడు చూడు నానెచ్చెలి ఆడుతూ వుంది.

విదూ.—(కోపముతో) లంజెకూతురా, నీవుకూడా నన్ను నిద్రపోనియ్యవా!? ఎప్పుడు తొలిమారు ప్రియవయస్యుడు ఆరణ్యికను చూచినాడో అప్పటినుంచి అతనితో గూడ నాకున్ను రాత్రింబగులు నిద్ర లేదు. కనుక బైటికి వెళ్లి నిద్రపోతాను.

[అని వెలికేఁగి పరుండును.

ఆర.—(మరల పాడును.)

తే. క్రొత్తవలపు గొలిపి యుత్తలంపెట్టెడు
క్రించుమరుని బారికిఁ దలంకి
తేఁటిముగుద కాంచఁ దివురుచునున్నది
యెదను జూఁడిగొనినయెమ్మెకాని. ౩౫.

రాజు.—(విని తటాలున దరిసి) బళీ! రాజకుమారీ, బళీ! ఆహాపాట! ఆహా వాద్యము! అట్లే గదా;—

శా. ప్రాపై వ్యంజనధాతువు ల్పదియు సంపాదించె వ్యక్తత్వమున్;
బ్రాపించె న్లయ మధ్యమద్రుతవిలంబచ్ఛిన్న మై తెల్లమై;
గోపుచ్ఛప్రముఖంబు లౌయతులు సేకూర్చెన్ రహిన్ మూఁడునున్;
జూపంగాఁబడెఁ దత్త్వపూర్వకము లై సొంపారు వాద్యక్రియల్. ౩౬.

ఆర.—(వీణను వదలి ఆసనమునుండి లేచి రాజును కొర్కెతో కనుచు) ఒజ్జా, మ్రొక్కుతున్నాను.

రాజు.—(నవ్వుచు) ఏది నేను కోరుచున్నానో అది నీ కగునుగాక.

కాంచ.—(ఆరణ్యిక కూర్చున్న యాసనమును చూపి) ఒజ్జగారు ఇక్కడనే కూర్చుండవలెను.

రాజు.—(కూర్చుండి) రాజకుమారి యిపుడెటుఁ గూర్చుండవలయును.?

కాంచ.—(నవ్వుచు) ఇపుడే భర్తృదారికను మీరు విద్యాతిశయానికి మెచ్చుకొన్నారు. కనుక ఈమె ఒజ్జగారిపీఠానికి తగినదే.

రాజు.—కూర్చుండునుగాక, ఈసుందరి అర్ధాసనమునకు తగినదే; రాజకుమారీ కూర్చుండుము.

[ఆర.—కాంచనమాలం గనును.

కాంచ.—(నవ్వుచు) భర్తృదారికా, కూర్చో; ఏమి యిందులో దోషం? విశేషమయిన శిష్యవు గదా నీవు.

[అర.—సలజ్జముగా కూర్చుండును.

వాస.—(లజ్జతో) భగవతీ, కావ్యాన్ని ఎక్కువగా కల్పించినావు. ఆ సమయంలో నేను ఆర్యపుత్త్రునితో ఏకాసనంలో కూర్చోనే లేదు.

రాజు.—రాజకుమారీ, వెండియు వినఁగోరికగా నున్నది, వాయింపుము వీణను.

ఆర.—(చిఱునవ్వుతో) కాంచనమాలా, శానాసేపట్నుంచి వాయిస్తున్నందున నాకు అలుపుగా ఉంది. ఇప్పుడు నాఒళ్లు దస్సిఉన్నది, కనుక వాయించడానికి శక్తుగాలనుగాను.

కాంచ.—ఒజ్జా, ఎంతో డస్సిపోయింది భర్తృదారిక, చెక్కిళ్లమీదకొత్తచెమట మొగ్గలలాగు బొట్లు కట్టివున్నది; చూడు ఈమెయుంజేతులు వణుకుతున్నవి. కనుక రవంతసేపు అలుపు తీర్చుకోనీ.

రాజు.—కాంచనమాలా, సరిగా చెప్పితివి. [అని చేయి పట్టుకొనఁ బోవును.

[ఆర.—చేయి వెనుకకు తీసికొనును.

వాస.—(అసూయతో) భగవతీ, నీవు ఎక్కువగా కల్పించినావు. కాంచనమాల చేసిన కావ్యంతో వన్ను వంచించ వల్లపడదు.

సాంకృ.—(నవ్వి) ఆయుష్మతీ, కావ్యమనఁగా ఇట్టిదిగానే యుండును.

ఆర.—(కోపముతోనుంబోలె) పో కాంచనమాలా పో, నీకూ నాకూ సరిపడదు.

కాంచ.—(చిఱునవ్వుతో) నేను ఉంటే సమ్మతి గాకపోతే పోతాను లే.

[అని నిష్క్రమించును.

ఆర.—(తత్తరపాటుతో) కాంచనమాలా, పోకు పోకు. ఇదుగో యీాయనకు ఇచ్చితిని మంజేతిని.

రాజు.—(ఆరణ్యిక చేతిని కైకొని)

సీ. అప్పుడె మంచుబొట్లప్పళింపఁగఁ జల్వ
లగ్గలించెడుతమ్మి మొగ్గయొక్కొ?

వేకువనే యెండఁ బీల్చుదానను నాన
నీసహజాహ్లాద మెట్లు గల్గు?
తోరంబుగా నిట్లు తొరఁగెడును హిమంబుఁ;
బరికింపఁగా హిమభానుఁ డొక్కొ?
అవుర! యాతం డెట్టు లగు? వెల్గుసూదులఁ
జుఱచుఱ విరహులఁ జూడు నతఁడు;
తే. ఇంక మఱి యేదొ యిది? యహాహా! యెఱుఁగనేర!
నహహా! తెలిసెను! నునుఁజెమ రనుమిషమున
నమృతవర్షంబు గురిసెడు ననవరతము,
నద్భుతస్పర్శనము ప్రియాహస్తమ యిది!

మఱియు,—

తే. లేఁతపవడంపుఁజివుళులలీల నేలు
నట్టిదీనను నీదుస్వహస్తమునను
స్వయముగా నీవు నాదుహృదయమునందు
రాగమును బెట్టితివి రాజరాజవదన. ౩౭.

ఆర.—(స్పర్శవిశేషము నభినయించుచు మనస్సులో) అయ్యయ్యో! ఈమనోహరుణ్ని చేతికొనతోటే తాకినంతమాత్రాన నాయవయవాలు ఆనందము పొందుతున్నవి.

వాస.—(తటాలున లేచి) భగవతీ, నీవు చూడు. నే నేమో యీ కల్లను చూడ నొల్లను.

సాంకృ.—రాజకుమారీ, ధర్మశాస్త్రమందు విధింపఁబడినది యిది గాంధర్వవివాహము. ఇందు లజ్జకు కారణ మేమున్నది? ఆట ఇది, కావున అకారణముగా రసము చెడఁగొట్టి లేచిపోవుట యుక్తముగాదు.

[వాస.—నడచును.

ఇందీ.—(చూచి) దేవీ, వసంతకుడు చిత్రశాలద్వారంలో నిద్రపోతున్నాడు.

వాస.—(చూచి) వసంతకుడే యితడు. (ఆలోచించి) రాజు కూడా ఇక్కడనే ఉండును. ఇతణ్ని నిద్రలేపి అడుగుతాను. [నిద్ర లేపును.

విదూ.—(నిద్రమబ్బుతో లేచి తటాలున చూచి) మనోరమా, ఏమి ఆడి వచ్చినాడా ప్రియవయస్యుడు, లేక ఆడుతూనే వున్నాడా?

వాస.—(వగపుతో) ఏమీ! ఆర్యపుత్రుడా ఆడుతున్నాడు! మరి మనోరమ యేమైంది?

విదూ.—ఇదుగో చిత్రశాలలో వుంది.

మనో.—(భయముతో) ఏమి! మనస్సులో వేరే అభిప్రాయంతో దేవి పలికతే, ఈ తెలివితక్కువపజ్జువాడు మఱియొకవిధంగా గ్రహించి సమస్తం పాడుచేసినాడు.

వాస.—(కోపముతో, నవ్వుచు) లెస్స! మనోరమా, లెస్స! చక్కగా నటించినావే నీవు!

మనో.—(భయముతో వణఁకుచు పాదములలో వ్రాలి) దేవీ, ఇందులో నాతప్పేమీ లేదు. ఈ చెడిబదికినవాడు బలిమిచేత నాచేతి అలంకారాలు లాక్కొని ద్వారంలో ఉండి నన్నిక్కడ అరికట్టినాడు. నేను ఎంత మొరవెట్టినా మద్దెళమోతలో నామొర ఎవరికిన్ని వినబడ్డదిగాదు.

వాస.—ఒనే లే. తెలిసింది సమస్తం. వసంతకుడు గదా ఆరణ్యికావృత్తాంత నాటక సూత్రధారుడు.

విదూ.—దేవీ, నీవే ఆలోచించు, ఆరణ్యిక యెక్కడ, వసంతకు డెక్కడ!

వాస.—మనోరమా, ఇతణ్ని దిట్టంగా పట్టుకొని రా. ఇతనినాటకాన్ని చూతాము.

మనో.—(స్వగతము) ఇప్పుడు నాయెడలు తీరింది. (ప్రకాశము) సరే. (అని విదూషకుని గొంతు కట్టి) చెడిబదికినబాపడా, ఇప్పుడు అనుభవించు నీచెడునీతికి ఫలం!

వాస.—(తొట్రుపాటుతో సమీపించి) ఆర్యపుత్రా, అమంగళం పోవుగాక!

[అని పాదములనుండి నల్లగలువదండను తీసివైచును.

ఆర.—భయముతో ఆవలికి జరిగి నిలుచుండును.

రాజు.—(తటాలున లేచి విదూషకుని మనోరమను గాంచి, ఆత్మగతము) ఏమి! తెలిసికొన్నారే నన్ను! [వెఱఁగుపాటు నభినయించును.

వాస.—(ఉపహాసముతో) మన్నించు ఆర్యపుత్రా, మనోరమ వనుకొని నిన్ను నల్లగలువదండతో కట్టించినాను.

సాంకృ.—(అందఱను కని, చిఱునవ్వుతో) ఏమి! ఇది వేఱే ఆటగా పరిణమించినదే! మాబోంట్లకిది తావు గాదు. [అని నిష్క్రమించును.

రాజు.—(ఆత్మగతము) ఈకోపవిధము అపూర్వముగా నున్నది. ఊఱడించుట అసాధ్యముగా నగపడుచున్నది. (ఆలోచించి) కానీ ఇట్లు చేసెదను. (ప్రకాశము) దేవీ, కోపము మానుము.

వాస.—ఎవరిక్కడ కోపగించినారు?

రాజు.—ఏమి నీవు కోపగింపలేదా?

ఉ. నెయ్యముఁ జూపు దాల్చినను, నేత్రము శోణసరోజమిత్త్రమే;
తియ్యము మీఱియున్ బలుకు దీల్పడుఁ దొట్రిలు గద్గదం బగున్;
చయ్యన డించినన్ దెలియుఁ జన్గవకంపముచేత నూరుపుల్ ;
అయ్యెను! బైప్రసాద మివి యద్దమ నీరుప డాఁగురింపఁగాన్ ! ౩౮.

మన్నింపుము ప్రియా, మన్నింపుము.

వాస.—ఆరణ్యికా, నీవు అలిగినావని యార్యపుత్త్రుడు మన్నింపు వేడుకొంటు న్నాడు, దగ్గిరికి వెళ్లు. [అని చేయి పట్టి లాగును.

ఆర.—(భయముతో) దేవీ, నే నేమీ యెరగను.

వాస.—ఆరణ్యికా, ఏమి! నీవెరగవా? ఇదుగో నీకు నేర్పుతాను. ఇందీవరికా, దీన్ని పట్టుకోవే.

విదూ.—అమ్మా, నేడు వెన్నెలపండగ అని నీచిత్తం పొందడానికి వయస్యుడు ఆట ఆడినాడు.

వాస.—ఈ మీ చెనటిచెయ్యం చూడగా నాకు నవ్వు వస్తున్నది.

రాజు.—వేఱువిధముగా తలంపవలదు. కనుము.—

ఉ. ఏల కళంకిఁ జేసెదు ముఖేందునిఁ గన్బొమలన్ ముడుంచుచున్ ?
గాలికి నాడుమం కెనవగన్ బొరయించెదు మోవి నేలొకో?
సోలెడిఁ గా నురోజభృతి, స్రుక్కఁగఁ జేసెద వేల యింకనున్ ?
ఖేలన మీక్రియన్ నిను నగింపనె చేసితి; మాను కోపమున్. ౩౯.

దేవీ, క్షమింపు క్షమింపు. [అని యడుగులలో వ్రాలును.

వాస.—ఒసే ఆట ముగిసింది. మరి రా, లోనికే పోదాము.

[అని స్త్రీసమూహంబును విదూషకుండును నిష్క్రమింతురు.

రాజు.—ఏమి! మన్నింపకయే పోయినది దేవి!

ఉ. ఒక్కటి భ్రూకుటీధరము నుత్కటఘర్మకణంబుఁ జండమున్,
దక్క భయాకులంబుఁ జకితప్లవమానమృగీవిలోకమున్,
దక్కొన దేవిమోము దయితాముఖపద్మము ప్రోలఁ గాంచుచున్
జిక్కితి భీతిచే వలపుచేతను నే బలుసంకటంబునన్. ౪౦.

కావున నిపుడు పడకకుం బోయి దేవిని అలుకదీర్చునుపాయ మరసెదను.

[అందఱు నిష్క్రమింతురు.

తృతీయాంకము ముగిసినది.

ప్రవేశకము.

(అంతట మనోరమ ప్రవేశించును.)

మనో.—(భయముతో) అయ్యో! ఎంతదీర్ఘకోపం దేవికి! ఇంత కాలం చెరలో ఉంచిన్ని నాయనుగుజెలిని ఆరణ్యికని కనికరింప దాయను! (కన్నీళ్లతో) ఆదీనురాలు రాజు నిక చూడ ననే నిరాశచేత వ్యసనపడుతున్నదే గాని తనచెరకు సమేతూ అంత వ్యసనపడడం లేదు. ఆమె ఆదుఃఖంచేత ఇప్పుడే ప్రాణాన్ని వదలనుండగా ఎట్టకేలకు నేను నివారించినాను. ఈవృత్తాంతాన్ని ఏలినవారికి దెలపమని వసంత కయ్యతో చెప్పివస్తున్నాను.

(అంతట కాంచనమాల ప్రవేశించును.)

కాంచ.—ఏమి! ఎంతవెదికినా నాకు భగవతి సాంకృత్యాయని కనబడదాయను; (చూచి) మరి ఈమనోరమని గూడ అడుగుతా. (సమీపించి) మనోరమా, ఎఱుగుదువా భగవతి సాంకృత్యాయని యెక్కడ వుందో?

మనో.—(చూచి, కన్నీళ్లు తుడుచుకొని,) ఒసే కాంచనమాలా, ఆమెతో నీ కేం పనే?

కాంచ.—మనోరమా, నేడు అంగారవతీదేవికాణ్నుంచి జాబు వచ్చింది. దాన్ని చదువుకొని కన్నీళ్లు నించుకొని మిక్కుటంగా దేవి వ్యసనపడుతూవుంది. ఆమెను ఓదార్చడానికి భగవతిని వెదుకుతున్నాను.

మనో.—ఒసే, మరి ఆజాబులో ఏముంది?

కాంచ.—'నా తోబుట్టువు పెనిమిటి దృఢవర్మ నీకు తండ్రి గాడా? నీకు వేరే చెప్పవలెనా? ఆయన్ని పాదలికళింగుడు చెరలో ఉంచి సంవత్సరానికి పైబడ్డది. గనక ఈవృత్తాంతాన్ని సమర్థుడికి నీభర్తకు నీవు తెలపకుండ ఊరోక్కవడం సరికాదు.' అని.

మనో.—చెలీ, కాంచనమాలా, ఈవృత్తాంతాన్ని ఎవ్వరున్ను దేవికి విన్నపించవద్దని ప్రభువు ఆజ్ఞాపించివుండఁగా ఎవ రిపుడు ఆమెకి ఆజాబు చదివి వినిపించినవారు?

కాంచ.—చదువుకొని ఊరుక్కున్న నాచేతులోనుంచి తీసుకుని దేవి తానే చదువుకుంది.

మనో.—అటయితే నీవు వెళ్లు. ఇదుగో దేవి ఆమెతోటే దంతపుమేడలో వుంది.

కాంచ.—అటయితే దేవికాడికే వెళ్తాను. [అని నిష్క్రమించును.

మనో.—నేను ఆరణ్యికకాణ్నుంచి వచ్చి శానా సేపు అయింది. పాపం! అది తనప్రాణంమీద ఎంతో విసిగిపోయింది. ఒకవేళ గొప్పచెట్ట కలిగినా కలుగుతుంది. కనక, అక్కడికే వెళ్తాను. [అని నిష్క్రమించును.

ప్రవేశకము ముగిసినది.

చతుర్థాంకము.

—ം—

(అంతట దుఃఖాక్రాంతురాలై ఆసనస్థ వాసవదత్తయు, సాంకృత్యాయనియు విభవంబుగా పరివారమును ప్రవేశింతురు.)

సాంకృ.—రాజకుమారీ, దిగులుపడవలదు. ఇట్టివాఁడు కాఁడు వత్సరాజు. నీతల్లితోఁబుట్టువుయొక్క పెనిమిటి యిట్టి యిడుముపా లయినాఁ డని యెఱిఁగి వత్సరాజు నిశ్చింతగా నుండునా?

వాస.—(కన్నీళ్లతో) భగవతీ, నీవు ఇప్పుడు ఎంతైనా తిన్న నిదానవు; ఆయనకు నాతోఁటే పని లేదే, నావాళ్లతో నేంపని? అమ్మకు తగును నా కీలాగ వ్రాయడం. ఏలంటే, ఆమె ఇప్పటికిన్ని వాసవదత్త మునపటివాసవదత్తే అని అనుకొంటూ వుంది. నీకైతేనో ఈయరణ్యికావృత్తాంతం ప్రత్యక్షం. నీవున్ను ఈలాగ చెప్తా వేమి?

సాంకృ.—నాకు ప్రత్యక్షమయినందుననే పలికెదను. ఆయన నిశ్చయముగా కౌముదీమహోత్సవములో నిన్ను నవ్వించుటకు అట్లు ఆడినాఁడు.

వాస.—భగవతీ, ఇట్లు నిజంగా నవ్వులపాలుచేశినాడు, కనుకనే భగవతియెదట లజ్జచేత ఎట్టకేలకు ఉన్నాను. ఏల ఆవిషయాన్ని గుఱించిన మాటలు? ఈపక్షపాతంచేతనే ఈ దశకు వచ్చినాను. [అని యేడ్చును.

సాంకృ.—రాజపుత్త్రీ, ఏడువకు; వత్సరాజు ఇట్టివాఁడు కాఁడు. (చూచి) పోనీ, నామాట లేల? రానే వచ్చినాఁడు నీశోకమును దీర్చువాఁడు వత్సరాజు.

వాస.—ఇవి భగవతి కోరికలు.

(అంతట రాజును విదూషకుఁడును ప్రవేశింతురు.)

రాజు.—ఏమి యుపాయము ప్రియను విడిపించుటకు?

విదూ.—వయస్యుఁడా, వగవకు; నేను నీకు ఉపాయం చెప్తాను.

రాజు.—వయస్యా, త్వరగా చెప్పవోయి.

విదూ.—ఒయ్యోవ్, నీకు మరి పెక్కుపోరులలో దొమ్ములలో తిన్న దెబ్బలకి మచ్చలుఁగట్టిన బుజందూలాలు వున్నవి. పయిగా, లేస్తివా, ఏనుగల గుఱ్ఱాల కాలుబంట్ల పెద్ద రాణువతో లేస్తావు. కనక నీసైన్యాలన్నిటినీ మొత్తంచేశి అంతఃపురానికి ముట్టడేసి ఇప్పుడే ఆరణ్యికని విడిపించు.

రాజు.—వయస్యా, అసాధ్యము నుపదేశించితివి.

విదూ.—ఇందులో అసాధ్య మేముంది? ఎందుకంటే—అక్కడ, గుజ్జు కఱుచ వెంగలి ముదుక యంగజాలలు దప్ప వేరే నరమానవుడు లేడు.

రాజు.—(తిరస్కారముతో) ఏమి అసంగతములు ప్రేలఁ జొచ్చితివి? దేవియనుగ్రహము తప్ప ప్రియను విడిపింప ఒండు ఉపాయము లేదు. కనుక దేవియనుగ్రహమునకు ఉపాయము చెప్పుము.

విదూ.—అయితే ప్రాణాలు బిగబట్టుకొని ఒకనెల ఉపవాసం వుండు, అంతట దేవి చండి గదా ప్రసన్నురాలు అవుతుంది.

రాజు.—(నవ్వి) ఎకసక్కెములు నిలుపు. దేవిని ఎట్లు అలుక దీర్తునో చెప్పు.

ఉ. దిట్టతనాన నవ్వుచు నదీనతఁ గంఠముఁ గౌఁగిలింతునా?
యట్టె చటుప్రపంచమున హర్షము నొందఁగఁ జేసికొందునా?
నెట్టనఁ గేలు మోడ్చి పదనీరరుహంబులఁ ద్రెళ్లి యుందునా?
యెట్టులు దేవియీ సపనయింపఁగ నౌను మెఱుంగ మిత్త్రమా. ౪౧.

కావున రా దేవికడ కే పోవుదము.

విదూ.—అయ్యా, నీవు పో. నే నేమో చెరలోనుంచి ఏలాగో తప్పించుకొని వచ్చాను. నేను ఇంటికి వెళ్తాను.

రాజు.—(నవ్వి, మెడ పట్టుకొని బలిమి మెయి మరలించి) రావోయి మూర్ఖుఁడా. (నడచి, చూచి) ఇదిగో దేవి దంతవలభియందు కూర్చున్నది. సమీపించెదను.

[అని లజ్జించుచు సమీపించును.

[వాస.—ఆసనమునుండి లేచును.

రాజు.—

ఉ. ఏల దొలంగె దాసనము నిక్రియ నాకయి? యిట్లు త్రోటుపా
టేలొకొ? లేవఁగావలయునే ననుఁ గూరిచి తాంతమధ్యరో?
లోలకటాక్షపుంగృపకు లోనగుదాసుని నట్ల ప్రపన్ను నీ
వేల మహాదరంబు పచరించి విలక్షునిఁ జేసె దిమ్మెయిన్? ౪౨.

వాస.—(ముఖముం గాంచి) ఇపుడు నీవు వెఱఁగుపడిన వాడవే అయినావు.

రాజు.—ప్రియా, నిజముగా నేను విలక్షుఁడనే, ఏల యన, నా తప్పు ప్రత్యక్షముగా కనఁబడినను, నిన్ను అనుగ్రహము వేఁడ వచ్చినాఁడను.

సాంకృ.—(ఆసనముం జూపి) ఆసనమును అంగీకరింపఁదగును.

రాజు.—(ఆసనముం జూపి) ఇట ఇట, దేవి కూర్చుండవలయును.

[వాస.—నేలఁ గూర్చుండును.

రాజు.—అయ్యో! ఏమి నేలఁ గూర్చున్నదే దేవి! నేనును ఇటనే గూర్చుండెదను. (అని నేలఁ గూర్చుండి) ప్రియా, కరుణింపు కరుణింపు. ఏమి! ప్రణతుఁడ నైనను నామీఁద నిట్లు లోలోపల కోపము దాల్చియున్నావు?

చ. ముడువవు గాని కన్బొమల, ముగ్ధవిలోచన యెత్తు వెంతయున్;
వడఁకును మోవియుం దడఁతు, శ్వాసము నూర్చెదు దీర్ఘదీర్ఘమున్;
నుడివెదు గాని, నిల్చెదు మనోగతి దేనినో చింతసేయుచున్;
అడఁచిన నీదుకిన్క నిభృతాహతికై వడి నన్ను నొంచెడిన్. ౪౩.

ప్రియా కరుణింపు కరుణింపు. [అని పాదముల వ్రాలును.

వాస.—నీ విప్పుడు అతిసుఖంలో మునిగి ఉన్నావు. ఏల దుఃఖంలో బడియున్నదాన్ని వెక్కిరిస్తావు? లే లే ఎవ రిక్కడ కోపగించినారు?

సాంకృ.—లెమ్ము, మహారాజా. ఈజోలి యేల? ఈవగపునకు కారణము వేఱే.

రాజు.—(ఆకులపాటుతో) భగవతీ, మఱి యేది?

[సాంకృ.—చెవిలో చెప్పును.

రాజు.—(నవ్వి) అటులైన వగవ నక్కఱలేదు. నాకును తెలిసినది. అయినను ఒక్కమ్మడిగా ఈప్రయోజనము నెఱవేఱినప్పుడే దేవిని అభినందింపనెంచి ఇంత తడవు చెప్పకుంటిని. అంతియగాని నేను దృఢవర్మవిషయమున అక్కఱలేనివాఁడ నై యుందునా? అచటి వార్త వచ్చి కొంచెము దినములే అయినవి. అచ్చటిస్థితి యిది.

తే. విజయసేనుని మొన మనవిజయసేన
బయటి దేశంబు పట్టఁగాఁ బ్రభవ మేది
దుర్గముఁ గళింగహతకుండు దూరి యందుఁ
గోటగోడయె శరణుగాఁ గొందుకుచుండె. ౪౪.

ఆదశలో నున్న యాతనిని,—

ఉ. ముట్టడి కల్కినట్టి తనమ్రోల సుభృత్యులు నాఁడునాఁటికిన్
గిట్ట, గజాశ్వము న్మడియ, క్షీణము గాఁగ సమస్తసైన్యముల్,
పట్టి తదీయదుర్గము సపాటము సేసి, కళింగుఁ బాదలిన్
గట్టిరొ కొట్టిరో యొకటిగా వినెదమ్మరొ నేఁడొ యెల్లియో. ౪౫.

సాంకృ.—రాజపుత్త్రి, ముందే నేను నీతో చెప్పియుంటిని గదా, 'వత్సరాజు ప్రతీకారము సేయక యొప్పరికించునా?' అని.

వాస.—అటయితే నాకు చాలా ప్రియము.

(ప్రతీహారి ప్రవేశించి.)

జయం ఏలినవారికి. ఇడుగో విజయసేనుడు దృఢవర్మకంచుకితో గూడ సంతోషంచేత కళ్లు చారడేసి కాగా ప్రియం చెప్పడానికి ద్వారంలో వచ్చి వున్నాడు.

వాస.—(చిఱునవ్వుతో) భగవతీ, ఆర్యపుత్త్రుడు నన్ను చాలా సంతోషపెట్టినాడని నేను తలుస్తున్నాను.

సాంకృ.—వత్సరాజుమీఁద పక్షపాతినిని గదా నేను. నే నేమియు చెప్పను.

రాజు.—త్వరగా ప్రవేశపెట్టుము వారిని.

ప్రతీ.—చిత్తం. [అని నిష్క్రమించును.

(అంతట విజయసేనుండును కంచుకియు ప్రవేశింతురు.)

విజ.—అయ్యా కంచుకీ, ఇపుడు ఏలినవారిని చూచెదను గదా అని, అది యేమో సాటి లేని సంతోషాతిరేకమును అనుభవించుచున్నాను.

కంచు.—సత్య మిది. వినుము;

క. ఒందువగనేని దొరఁ గను
పందువు సేసికొనుభటుఁడు ప్రమదజడుఁ డగున్,
దండిపగఱ దొరయానతిఁ
జెండిన వీరవరుమాట చెప్పవలయునే! ౪౬.

ఇరువురు.—జయము ఏలినవారికి. [రాజు ఇరువురనుం గవుంగిలించును.

కంచు.—దేవ, ఆహా నీకు మేలైనది.

క. పొలియించి హతకళింగుని,
నెలకొల్పి మదీయవిభుని నిజరాజ్యములో,
నిలలోన విజయసేనుఁడు
నిలిపెన్ వీర్యాగ్రగుండు నీశాసనమున్. ౪౭.

వాస.—భగవతీ, ఆనవాలు పట్టినావా ఈకంచుకిని?

సాంకృ.—ఆనవాలు పట్టకేమి? ఇతనిచేత నిచ్చియే గదా మాపినతల్లి నీకు బొమ్మల జతను పంపినది.

రాజు.—బలారే! విజయసేనుఁడా! గొప్పకార్యము నెఱవేర్చితివి!

[విజ.—పాదములందు వ్రాలును.

రాజు.—దేవి, ఆహా! నీకు మేలు. దృఢవర్మ మరల రాజ్యమందు నెలకొన్నాఁడు.

వాస.—(హర్షముతో) అనుగ్రహము చేసితివి.

విదూ.—ఇట్టి గొప్పశుభంలో ఇటువంటి రాజకులంలో చేయవలసింది ఏమంటే (రాజును చూపి వీణావాదనము నభినయించుచు) గురుపూజ, (తనజన్నిదమును చూపుచు) బ్రాహ్మణుడికి సత్కారం, (ఆరణ్యికను సూచించి) చెరలోనివాళ్లనెల్ల విడిపించడమున్ను!

రాజు.—(వాసవదత్తనుండి అపవారించి చిటిక వేయుచు) సరి వయస్యుఁడా సరి.

విదూ.—అమ్మా, ఈవిషయంలో ఏమి యానతిస్తావు?

వాస.—(సాంకృత్యాయనిం గాంచి లేఁతనవ్వు నవ్వుచు) ఈ చెడిబదికినవాడి మూలంగా ఆరణ్యికకు విడుదల అయినది.

సాంకృ.—పాపము! దానిని చెఱ నుంచిన నేమి ప్రయోజనము?

వాస.—భగవతియిచ్ఛ ఏలాగో ఆలాగు.

సాంకృ.—అట్లని నేనె దానిని విడిపించెదను. [అని నిష్క్రమించును.

కంచు.—ఇట్లును మఱి మహారాజు దృఢవర్మ సందేశించినాఁడు, 'నీదయచేత సర్వమును కోరినట్లు నెఱవేఱినది, కావున ఈప్రాణములు నీయవి. నీయిచ్ఛ వచ్చినట్లు వీనిని పనిగొన నీవే ప్రమాణమవు.' అని. [రాజు లజ్జతో మొగము వాంచును.

విజ.—దేవా, ఏలినవారిపై దృఢవర్మకుం గల ప్రీతివిశేషము చెప్ప నలవి గాదు.

కంచు.—'నీకు నే నిచ్చిన మాకొమారిత ప్రియదర్శిక అగపడకపోయినందున నీతో సంబంధము ఘటిల్లదాయె నని నాకు వంత బలమైనను వాసవదత్తను నీవు పెండ్లి యయినందున అదియును తీఱినదే.' అని.

వాస.—(బాష్పములతో) అయ్యా కంచుకీ, నాచెల్లెలు ఏ లాగు అగపడక పోయింది?

కంచు.—రాజపుత్త్రీ, కళింగహతకుని యాముట్టడిలో అంతిపురిజనులు ఎక్కడికెక్కడికో పరారి కాఁగా, నేను పుణ్యావశమున ఆమెను గాంచి అట్టిసమయములో అక్కడ ఆమె యుండఁదగ దని తోడ్కొని వత్సరాజుకడకు తరలితిని. అనంతరము ఆమెను వింధ్యకేతువుచేతిలో నుంచి స్నానమునకు వెడలితిని. మరలి వచ్చునంతలో ఎవరో ఆచోటిని వింధ్యకేతునిం గూడ కథామాత్రశేషముగా నొనర్చిరి.

రాజు.—(చిఱునవ్వుతో) విజయసేనా, ఏమి చెప్పెదవు?

కంచు.—అచట వెదకియు ఆమెను కాననైతిని. అప్పటినుండి యిప్పటికిని తెలియలేదు ఎట నున్నదో.

(అంతట మనోరమ ప్రవేశించును.)

మనో.—దేవీ, ఆదీనురాలు ప్రాణసందేహంలో నున్నది.

వాస.—(కన్నీళ్లతో) ఏమి నీవు మా ప్రియదర్శనవార్త నెరుగుదువా?

మనో.—ప్రియదర్శనవార్తను నే నెరగను. ఇదే యారణ్యిక తేనె అని మిష పెట్టి విషం తాగి ప్రాణసందేహంలో ఉన్నదని నేను విన్నపం చేసుకొన్నాను. కావవలెను దేవీ కావవలెను. [అని యేడ్చుచు పాదముల వ్రాలును.

వాస.—(స్వగతము) అయ్యయ్యో! ఈయారణ్యికావృత్తాంతంచేత ప్రియదర్శన దుఃఖం అంతరించింది. లోకులు అతి దుర్జనులు, ఒకవేళ నన్ను వేరువిధంగా తలిచినా తలుస్తారు. కనుక ఇప్పుడు తగినపని యిది. (ప్రకాశము, ససంభ్రమము) మనోరమా, శీఘ్రంగా ఇక్కడికే దాన్ని తేవే, నాగలోకాన విషవైద్యం నేర్చుకొన్నవాడు ఆర్యపుత్త్రుడు ఇందుకు సమర్థుడు. [మనోరమ నిష్క్రమించును.

(అంతట మనోరమ ఆదుకొనఁగా, విషవేగము
అభినయించుచు ఆరణ్యిక ప్రవేశించును.)

ఆర.—చెలీ, మనోరమా, ఎందుకు నన్ను చీకట్లోకి తీసుకపోతున్నావు?

మనో.—(వగచుచు) అయ్యో అయ్యో! దీనికంటికి కూడా విష మెక్కింది. (వాసవదత్తను చూచి) దేవీ, త్వరగా రక్షించు రక్షించు. మిక్కుట మయింది దీనివిషం.

వాస.—(తత్తరముతో రాజును చేయిపట్టుకొని) ఆర్యపుత్త్రా, త్వరగా లే, పాపం ఇది అడగారుతూ వుంది. [అందఱు చూతురు.

కంచు.—(చూచి) ఈమె రాజపుత్త్రిని ప్రియదర్శనను కేవలము పోలియున్నదే! (వాసవదత్తను ఉద్దేశించి). రాజపుత్త్రీ, నీకు ఎక్కడిది యీకన్యక?

వాస.—అయ్యా, వింధ్యకేతునికొమారిత. అతణ్ని పొలియించి విజయసేనుడు తెచ్చినాడు.

కంచు.—అతనికి కూఁతు రెక్కడిది? ఆ రాజపుత్త్రియే యీమె. అయ్యో, చెడితిని రా మందభాగ్యుఁడను! (నేలఁగూలి, లేచి) రాజపుత్త్రీ, ఈమె ఆప్రియదర్శిక! నీచెల్లెలు, అస్తమింపనున్నది.

వాస.—ఆర్యపుత్త్రా, కావు కావు! నాచెల్లెలు అంత మొందుతున్నది.

రాజు.—ఊఱడిల్లుము ఊఱడిల్లుము. ఇదె చూతము. కటకటా! కటకటా!

తే. క్రమముగాఁ దేనె నిండఁగఁ బ్రమద మారఁ
బోయెఁ దేఁటియుఁ దామరమొగ్గఁ గ్రోల,

మంచునుం బడి దానిని మాపఁ జొచ్చె,
విధి విరోధింపఁ గోర్కు లెవ్విధి ఫలించు! ౪౮.

మనోరమా, అడిగి చూడు 'నీ కేమేని తెలియుచున్నదా?' అని.

మనో.—సఖీ, నీ కేమైనా తెలుస్తూ వున్నదా? (కన్నీళ్లతో మఱల కదలించుచు) సఖీ, అడుగుతున్నాను గదా 'నీ కేమైనా తెలుస్తున్నదా?' అని.

ప్రియ.—(అస్పష్టముగా) ఈయవస్థను వచ్చినా నాకు మహారాజు కనబడ్డున్నాడు. [అని సగముమాటలో నేలఁ గూలును.

రాజు.—

చ. కలికికిఁ గన్ను మూఁతవడెఁ గ్రమ్మెను జీఁకటి నాకు దిక్కులన్;
నిలిచెను శ్వాస మింతికి, వినిర్గతచేష్టిత మయ్యె నాయొడల్;
ఎలుఁగు నిరుద్ధ మయ్యెఁ జెలి, కింకెను నానుడి నాదుకుత్తుకన్;
దలఁప విసంబె బాలకు వెత ల్సకలంబులు నాకె వాటిలెన్. ౪౯.

వాస.—(కన్నీళ్లతో) ప్రియదర్శనా లేవే; ఈయనే మహారాజు నీయెదట నున్నాడు; నేను తెలియక యేమి తప్పు చేసితినో ఇంత కోపగించి నాతో పలకవు? మన్నించు మన్నించు. ఇక తప్పు చెయ్యను జుమా. (విూఁదు చూచి) అయ్యో! పాడు దైవమా! నే నిపుడేమి తప్పు చేసితిని, నాచెల్లెలిని ఈయవస్థకు తెచ్చి చూపించితివి?
[అని ప్రియదర్శికమీఁద పడును.

విదూ.—వయస్యుడా, ఏమి నీవు జడంగా ఊరకున్నావు? ఇది దిగులుకు కాలం గాదు; విషగతి కుటిలం గదా; కనుక చూపు నీవిద్యాప్రభావం.

రాజు.—నిజమే యిది. (ప్రియదర్శికను జూచి) మూఢుఁడనే అయితిని ఇంతసేపు; మఱి యీబాలను బ్రదికించెదను. నీళ్లు నీళ్లు.

విదూ.—(వెలికేఁగి మరల వచ్చి) ఇవిగో నీళ్లు.

[రాజు ఆచమనముచేసి ప్రియదర్శికపై చేయి యుంచి మంత్రస్మరణము నభినయించును. ప్రియదర్శిక క్రమముగా లేచును.

వాస.—ఏమి నాపుణ్యం! నాచెల్లెలు బ్రదికినది!

విదూ.—అహాహా! ఏలినవారి విద్యాప్రభావము!

కంచు.—అహాహా! దేవరవారిన రేంద్రత అంతటను అడ్డులేనిదిగా నున్నది!

ప్రియ.—(లేచి కూర్చుండి ఆవులింత నభినయించుచు అస్పష్టముగా) మనోరమా, చాలా సేపు నిద్రపోయినానే.

విదూ.—వయస్యా, నీమంత్రవాదిత్వం రూఢికెక్కిందోయి.

[ప్రియ.—ఆసతో రాజుం గాంచుచు లజ్జతో కొంచెము మొగము వాంచును.

వాస.—ఆర్యపుత్త్రా, ఏమి ఇది యింకా వేఱు విధంగానే యున్నదే?

రాజు.—(లేత నవ్వుతో)

ఆ. చూపు నసిగ లేదు; స్ఫుటత చాలదు మాటఁ;
దనువు డయ్యె, గగురు కొనుఁ, జెమర్చు;
చన్నుఁగవకు వణఁకు సంధించుఁ గ్లేశంబు;
కాన నబల కింకఁ గలదు విషము. ౫౦.

కంచు.—(ప్రియదర్శిక నుద్దేశించి) రాజపుత్త్రీ, వీఁడే విూ నాయనగారి కింకరుఁడు ప్రణమిల్లుచున్నాఁడు. [అని పాదములం ద్రెళ్లును.

ప్రియ.—(చూచి) ఏమీ! కంచుకి ఆర్యవినయవసువా! (బాష్పములతో) అయ్యో నాయనా, అయ్యో అమ్మా!

కంచు.—ఏమవకు, వత్సరాజుప్రభావముచే నీతలిదండ్రులు క్షేమముగా నున్నారు. వెండియు మునుపటియట్లే రాజ్యము నేలుచున్నారు.

వాస.—(బాష్పములతో) రావే మాయలాడీ, ఇప్పుడైనా చెల్లెలిచెలిమిని జూపవే. (కంఠమునం గవుఁగిలించి) ఇప్పుడు ఊరడిల్లితిని.

విదూ.—అమ్మా నీవు చెల్లెలిని మెడలో కాగిలించుకొని యీలాగ పరమానందంలో వున్నావు. వైద్యుడికి బహుమానం మరిచినావు.

వాస.—వసంతకా, మరవలేదు. (రాజు నుద్దేశించి, మందహాసముతో) వైద్యుడా, చెయ్యి చాపు, నాచెల్లెలిముంజేతిని నీకు బహుమాన మిస్తాను.

[రాజు చేయి చాఁచును; వాస.—ప్రియదర్శికాహస్తమును అర్పించును.

రాజు.—(చేతిని విసర్జించి) ఏల యీకన్య? ఇప్పుడే యెట్టకేలకు ప్రసన్నురాలవైతివి.

వాస.—నీ వెవరవు పుచ్చుకోకపోవడానికి? ముందుగానే నాయన దీన్ని ఇచ్చినాడు.

విదూ.—మాననీయురాలోయి దేవి, ఆమెకు ప్రతికూలం చెయ్యకు.

[వాస.—రాజుచేతిని బలాత్కారముగా లివిచి ప్రియదర్శిక నిచ్చును.

రాజు.—దేవి యేలుచున్నది. దేవి చిత్తమును దాఁటుట కేటిసామర్థ్యము?

వాస.—ఆర్యపుత్త్రా, ఇంకా ఏమి ప్రియం చేయవలెను.

రాజు.—ఇంతకు పయిగా ప్రియము ఉండునా? చూడు.—

ఉ. మాసితరీతిఁ బొందె నిజమండలమున్ దృఢవర్మ వెండియున్;
బూనినకిన్క నీవు విడి పొందితి విప్పుడె నాపయిన్ గృపన్;
ప్రాణము దక్కి నిన్నుఁ జెలియల్ ప్రియదర్శిక గూడె; నింకనున్
దేనిని వేడఁగా వలయుఁ దెల్పఁగదే మఱి జీవితేశ్వరీ. ౧.

అయిన నిది యగుఁగాక.

(భరతవాక్యము.)

ఉ. వాసవుఁ డిష్టవృష్టుల నవారిగఁ బాడియుఁ బంటఁ బెంచుతన్;
భూసురు లిష్టులన్ సురసమూహములం దనియింత్రు గావుతన్;
వాసిగ సాధుసంగమము వర్ధిలుఁ గావుత శాశ్వతంబుగా;
నాసిలుఁ గావుతన్ ఖలుల నాల్కలు నాటెడుపాడుకొండెముల్. ౨.

చతుర్థాంకము ముగిసినది.

ప్రియదర్శికా నాటిక

సమాప్తము.

శ్రీ

ప్రియదర్శికా నాటిక.

కఠిన పద్యములకు తాత్పర్యము.

౧. వివాహహోమ విధియందు పొగచేత చూపులు కలఁతపడినను చంద్రకిరణముల చేత కన్నులు సుఖపడఁగా, మరల పెండ్లికుమారుని తమకముతో చూచుచు బ్రహ్మవలన ఎక్కుడు సిగ్గుచేత మోము వాంచినదై, (అద్దమువంటి) తన కాలిగోటియందు నెత్తిమీఁది గంగతోఁ గూడ ప్రతిబింబించిన శివునిమీఁద ఈసు దాల్చియు, (ఆయనచేతి) తాఁకుడు చేత గగుర్పాటునొందిన గౌరి మీకు మంగళము సేయుఁగాక.

౨. రావణుఁడు ఎత్తినంతట కైలాసపర్వతము తూలుచుండఁగా, ప్రమథులకు కుతూహలము ఉప్పొంగుచుండఁగా, కుమారస్వామి తల్లి యొమ్మునం జొరఁగా, వాసుకి కోపముతో పరికించుచుండఁగా, (శివుఁడు) కాలితో అదిమినంతట రావణుఁడు దేహము క్రుంగి పాతాళము నడుగునకు పోవుచుండఁగా, (రావణునిమీఁద) కోపముతో నున్న వాఁడయ్యును, పార్వతి భయమువలన బిగువుగా తనదేహమును కవుంగిలించినందున ఆనందించిన శివుఁడు మిమ్ము రక్షించుఁగాక.

3. శ్రీహర్షుఁడు నేర్పరియైన కవి, ఈసభయు గుణమును గ్రహించునట్టిది, వత్సరాజు కథయో లోకమందు మనోహరమైనది, మేమును నాట్యమందు సమర్థులము. ఈప్రతి యొకటియు కోరినఫలము లభించుటకు కారణమైయున్నది; ఇంక నేమి! నాయదృష్టాతిశయ మువలన నిదే సమస్తగుణముల సముదాయము సమకూడినది.

౪. గట్టిచెఱనుండి విడివడి వాసవదత్తను హరించి మహోత్కర్షను పొంది తనరాజధానిం జేరి వత్సరాజు ఎట్లు ప్రతాపించుచున్నాఁడో, అట్లే ఈసూర్యుఁడు మేఘముల యావరణమునుండి విడివడి కన్యారాశిం గూడిన యనంతరము తులారాశిం జేరి తన పూర్వతేజస్సును మరల పొందినవాఁడై మిక్కిలి క్రాఁచుచున్నాఁడు.

౫. త్రికరణశుద్ధిగా ఆచరించిన ధర్మమువలననుంబోలె నాకు చెఱవలన సకలశ్రేయములును కలిగినవి:—ఎట్లనఁగా:—నాసేవకులు నాకై పడినపాటువలన వారికి నాయందు భక్తి తప్పమి నాకు తెలియనయినది, నన్ను చెఱనుండి విడిపించుటకు యౌగంధరాయణాదిమంత్రులు చేసిన యద్భుతోపాయములవలన వారిప్రజ్ఞావిశేషము నాకు అనుభవమునకు వచ్చినది, మిత్త్రులయొక్క మైత్త్రియు తేటపడినది, ప్రజలకు నాయందుఁ గలయనురక్తి మిక్కిలి తెల్లమయినది, రణములో వాసవదత్తాబంధువుల నోడించి యాసుందరిని తెచ్చితిని గావున నారణక్రీడాకుతూహలము నెఱవేఱినది, లోకోత్తరయైనకన్య నన్ను వలచి నాకు దొరకినది.

౬. చీఁకటిచేత చొరరాని చెఱను లెక్కింతువుగాని ఆసుందరియొక్క ముఖచంద్రప్రభను లెక్కింపవు; సంకెలశబ్దముచేత నీకు బాధ కలిగెనేగాని ఆకోమలియొక్క మధురవాక్కులు గణనకు రావాయెను; క్రూరులయిన చెఱకాపరులను తలపోసెదవేగాని చెలిమి యొలికెడి యాక్రేఁగంటి చూపులను తలంపవు; నాస్వాతంత్ర్యమును పోఁగొట్టిన

యామోసమును దలంచెదవేగాని ఆచెలిసావాసమును ఎంచకున్నావు, చెలియొక్క దోషములనే ఎన్నెదవుగాని వాసవదత్తయొక్క గుణములను ఎన్నవు.

౯. తాను కాలరియై మొట్టమొదట కాలరిదండును అమ్ముత్రోపులమాత్రాననే నుగ్గుచేసి, బాణపరంపరచే గుజ్జుపుదండును బెదరిన లేటితండమో యనునట్లుగా దవ్వులకు తఱిమి, ఎల్లయాయుధములను ఎల్లయెడలను విసరి వైచి, చరాలున కత్తి దూసి, యనంతరము ఏనుఁగుదండులో అరఁటితోఁటం గోయు నాటను ఆడం దొడంగెను.

౧౦. ఈరీతిగా యుద్ధములో అసహాయుండ యై మన మూఁడంగములబలమును చీకాకుపఱిచి కత్తిని ఎగుబుజమున మోపుకొని దానినుండి నెత్తురు బుజమును కమ్ముచుండఁగా ఆయుధముల గాయములు నూర్లకొలఁది అొమ్మును చక్కఁగా బడలి ఎట్టకేలకు వింధ్యకేతువు కూలెను.

౧౧. దేవా, సవిలాసమైన నీమంగళస్నానమునకై వలయుగిండులను గంధచూర్ణమును అంతఃపురవారవిలాసిను లెల్లరును సమకూర్చుచున్నారు. ఆబడలికచేత సన్నని పైఁట జాఱఁగా కుచములు మఱుఁగుతొలఁగిన లావణ్యముతో ప్రకాశించుచు స్నానభూమికి అలంకారముగా నున్నవి. వానిచేత, స్నానభూమి, వారు తెచ్చియుంచిన బంగారు కలశములకంటె వేఱుగా తానును నీస్నానమునకై బంగారుకలశములను ఎత్తినదో యనునట్లు తోఁచుచున్నది.

౧౪. ప్రియ నన్ను వలచిన తొలితొలి దినములలో ఆవలపుచేత కృశించి, ఎక్కువ మండనము లొల్లక మంగళమండనములు మాత్రము దాలిచి, సగము అలసతతో సగమే ఘూఁకుచు, మొగము కొంచెపాటి పాండిమను దాల్చి ప్రభాతచంద్రునియొప్పును మించి సొంపారఁగా, కోర్కెగలదై నాకు నేత్రోత్సవము చేసినది. ఆదశలో ప్రియను వెండియుం గాంచు భాగ్యము చేకూరదు గావునను, వ్రతోపవాసముచేత నిపుడు అట్టిదశయే కలిగియున్నందునను, ఈదశలో నున్నప్రియను ఇపుడు చూచి ఆదశలోనే మరలం గాంచినట్లు ఆనందమొందఁగోరెదను.

౧౫. రాలియున్న వావిలి తోడిమలు కమ్మియున్న నేల చిన్న చిన్న పగడపు మోసులతో అలంకరింపఁబడినట్లు ఒప్పుచున్నది; ఏడాకులయరఁటిపువ్వుఁదావి మనసుకు కొట్టుచు పరికానిమదంపుగాటువాసనయను భ్రమను కలిగించుచున్నది.

౧౬. దిరిసెన పువ్వులవలె కోమల మయిన పచ్చికచేత మెత్తనిదై యీనేల యిప్పుడే కడిగిన పచ్చల చూర్ణముతో ఇప్పుడే యిట నెలకట్టు కట్టిరో యనునట్లు శోభిల్లుచున్నది. మఱియు ఇప్పుడే తొడిమలనుండి రాలిన మంకెనపువ్వుల మొత్తములచేత ఈనేల వర్షర్తువు దాఁటిపోయినను ఇంకను ఆరుద్రపురుగులు వందలు వందలుగా రాలి అంతటను మూఁగియున్నవో యనునట్లు ప్రకాశించుచున్నది.

౨౨. చంద్రమూర్తివలె, కన్నులకు, ఎడతెంపులేక కనులలో కురియు నమృతవర్షము ఎట్టిప్రీతిని చేయునో, అట్టిప్రీతిని చేయుచున్నదియు, మేఘమనెడి తెర తొలంగుచుండఁగా క్రమక్రమముగా ఎట్లు చంద్రమూర్తి చెప్పనలవిగాని దర్శనీయతను పొందునో అట్లే పయ్యెద జాఱుచుండ నించించుకగా పాలిండ్లదర్శనముచేత చెప్ప శక్యముగాని నేత్రోత్సవము నిచ్చుచున్నదియు, నయిన యీరమణియొక్క చేతితాఁకుడునకు చంద్రమూర్తియొక్క కిరణములతాఁకుడునకుం బోలె పాత్రము లయ్యును ఈ కమలములు వెంటనే ముకుళింపమియే అద్భుతముగా నున్నది.

౨3. ఓ వెఱపరీ, వగవకు. ఈతుమ్మెదలు నీమోముఁదమ్మిపై దానినెత్తావి నానుటకై మూఁగుచున్నవి. (వీనిని నేను తోలుచున్నాను.) నీ విట్లు మిక్కిలి బెదరి వీసం గాంచుచు నీవెడందకన్నులధాళధళ్యమును నలుదెసలం బర్వింపకుము; ఏలయన, అట్లు పర్వినయాధాళధళ్యము కలువతండ మని భ్రమసి మఱి యాతుమ్మెదలు నిన్ను వదలనే వదలవు.

౨౫. నాప్రియతమవలె పగటిశోభ పద్మవనకాంతిని కైకొని యేఁగినది; నాహృదయమునందుంబోలె సూర్యబింబమునందు రాగము (అనురాగము-ఎఱుపు) ఎక్కువగా నగపడుచున్నది; నావలెనే ఈ జక్కవయు చెలిని తలపోయుచు తామరకొలనిగట్టున నున్నది; నాకుంబోలె లోకమునకును తటాలున దిక్కులు చీఁకట్లు అయినవి.

౨౬. ఎడలేక పడుచున్న మదనబాణశతముల ఝూత్కారశబ్దమో యనునట్లుగా నిట్టూర్పుల మిషచేత రేయుంబవలు నీయనురాగము వెలువడుచున్నది.

౨౮. రత్నములవందలచేత వెలుఁగొందిన బంగారుకంబములందు కట్టఁబడిన పెద్ద ముత్తెసరములచే రమణీయంబును అచ్చరల గెలిచిన గుబ్బెతలచేత అధిష్ఠితంబును అగు నీ నాటకశాల దేవతల యాకాశయానమునకు తుల్యముగా ప్రకాశించుచున్నది.

3౦. ఇచట దేవేరుల యూడిగంపుఁజేడియలు సయితము, పాదములందు అందియలు, విశాలమయిన పిఱుందుపై మ్రోఁగుచున్న మొలనూలును, చనుగట్టులపై వెలుఁగులు చల్లుముత్తెపుఁజేరులును, బుజములందు అంగదములును, వీనులయందు కమ్మలును, చేతులందు కడియములును, తలకట్టునందు స్వస్తికంబును, దాల్చినవారై అగపడుచున్నారు.

33. నేత్రానందాధారభూత మయిన యీరూపము వత్సరాజురూపమే, వెలుఁగొందుచున్న యీవేషము ఆయన వేషమే, మదపుటేనుఁగునడకవంటియీనడక ఆయననడకయే, మిక్కిలిప్రౌఢ మయిన యీ గాంభీర్యము ఆయనదే, ఈ విలాసము అతనిదే, నీటితో నిండియున్న మేఘముయొక్క యుఱుమువంటి యీ ఎలుంగును ఆయనయెలుంగే, నేర్పరి యీమనోరమ మనకు సాక్షాత్తుగా వత్సరాజునే చూపినది.

3౪. రాజహంస మేఘములపేర్పుచే ఆక్రాంత మయిన యాకసముం గాంచినదై తన ప్రియను తోడ్కొని తన నివాస మయిన మానససరస్సును చేర్చుటకు కోరుచున్నది.

3౫. తుమ్మెదకొమ్మ క్రింం చయిన మదనుని మూలమున క్రొత్తవలపుచేత గెంటఁబడినదై తనకు కన్నులవిం దయినకాంతుని చూడఁగోరి అలయుచున్నది.

3౬. ఈపాటయందు పదివిధముల వ్యంజనధాతువులచేతను వ్యక్తి కలిగినది. ద్రుతము మధ్యము విలంబితము నని ముత్తెఱఁగుల భిన్నమైయుండు నీలయ స్పష్టపడినది; గోపుచ్ఛము లోనగు మూఁడుయతులును క్రమముగా చూపఁబడినవి; తత్త్వము, ఓఘము, అనుగతము, నను వాదనప్రకారములు మూఁడును చక్కఁగా చూపఁబడినవి.

(3౭). నాచేతిలోని యిది మంచుబొట్లు ఇప్పుడే కూడుటచేత చలువచల్లుచున్న తామరముగ్గ యగునా యేమి? నైసర్గికమైన యీ యాహ్లాదకరత్వము వేసవనే ఎండ గ్రావునదైన తామరమొగడకు ఉండ దని తలంచెదను. మఱి ఇట్లు మంచుమొత్తమును గురియు

చున్నదే! జాబిల్లియా? ఇసీ, ఏమి! ఆజాబిల్లియు గ్రాఁచువాఁడే! తెలిసినది! ఇది చేయి, చెమరునెపమున తెంపులేక అమృతము గురియుచున్నది.

౩౭. నీ విపుడు నా హృదయమున (ఉరమునను, మనస్సులోను) లేఁత పవడపుఁ జివురుయొక్క జిగిని హరింప జాణ యయిన యీనీచేతితో రాగమును (ఎఱ్ఱఁదనమును, అనురాగమును) ఉంచితివి.

౩౮. నీచూపు స్నేహమును చూపుచున్నను కన్నులకాంతి యెఱ్ఱగా నున్నది, నీ వాక్కు మధురముగా నున్నను డగ్గుత్తికపడి ప్రతిమాటలోను తొట్రుపడుచున్నది, నిట్టూర్పులు నీ వెంత యణఁచుకొన్నను పాలిండ్లయుబుకులాటచేత తెలియనగుచున్నవి, పైయనుగ్రహముచే.నీ వెంత దాఁచినను నీకోపము స్పష్టముగా అగపడుచునే యున్నది.

౩౯. జాబిల్లికి ఏల యిపుడు బొమముడులతో మచ్చ కల్పించెదవు? ఏల అదురుచేత మోవిని గాలికి కరము అల్లలనాడు మంకెన పూవుసాటిం బొందించెదవు? పాలిండ్లబరువునకే ఎంతయు వణఁకుచున్నది యీకౌను, ఇంక వేఱు గాసియు నేల? కోపము మానుము; నీచిత్తమునే పడయువాఁడనై నేను ఇట్లు ఆడితిని.

౪౦. నేను, ఎట్టయెదుట, కోపముచే చెమర్చుచు భయంకరముగా బొమలు ముడివైచియున్న దేవీముఖమును, భయముచేత ఎగిరి యెగిరి దాఁటుచున్న యాఁడులేడికనుఁగలువలవలె చంచలము లయినకనుఁగలువలు గలదైన ప్రియాముఖమును, చూచుచు తత్క్షణమే ఏకకాలమందే భయపడినవాఁడను, ఉత్కంఠితుఁడను, రెండును అయి మహాకష్టముపాలైతిని.

౪౧. ఏల యాసనమును వదలెదవు? నాయెడల (ఈ) తొట్రుపా టేల? నీ నడుము డస్సి యున్నది, నాకై యిట్లు లేచుట సరిగాదు; ఒక్కమాఱు కటాక్షించితివేని వశ్యుఁడయ్యెడి యీ జనుని అత్యాదరముచేత ఏల వెఱఁగుపఱచెదవు?

౪౩. ఓవామలోచనా, బొమలు ముడివైవవుగాని, మాటిమాటికి ఏడువను మాత్రమే డ్చెదవు; మోవి యదురుట లేదు గాని సదా నిట్టూర్పులను నిగుడ్చుచునే యున్నావు; మాట మానవుగాని, ఏమో ఆలోచనతో నెమ్మోము వాంచి యున్నావు; నీ గూఢకోపము పైకగపడని దెబ్బవలె నన్ను కరము నొగిలించుచున్నది.

౪౫. ఈ చెలికి కనుఁగవ మూఁతపడుచున్నది, నాకు దిక్కులు చీఁకట్లు అయినవి; ఈ చెలికి గొంతు అడుచుకొనుచున్నది, నాకు ఇవె మాటలు కష్టముగా వెలువడుచున్నవి; ఈ చెలికి ఊర్పు నిలిచిపోయినది, నా దేహము చేష్ట లుడిగినది; ఈ చెలికి విషమెక్కుటమాత్రమే అనియు, దుఃఖ మంతయు నాకే అనియు, తలంచుచున్నాను.

౪౭. కోరినవర్షము గురియుచు ఇంద్రుఁడు భూమిలో మిక్కుటముగా పయిర్లు పండించునుగాక, బ్రాహ్మణశ్రేష్ఠులు యజ్ఞములచే యథావిధిగా దేవతలకు ప్రీతి యొనర్తురుగాక, తగినదైన సజ్జనసాంగత్యము కల్పముతుదివఱకును మిక్కిలి దృఢ మగుఁగాక, దుమ్ముంపఁజాని వజ్రలేపము లగు కొండెగాండ్ర వాక్కులు సంపూర్ణముగా శమించునుగాక.

2102

2102

END OF
TITLE